DATE: 26-07-2022 RNI NO : TELTEL/2021/81092

మంగళవారం 26 జూలై, 2022



# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి(Volume) : 3 సంచిక(Issue) : 101

పేజీలు - 08 వెల: రూ 5/-

prajamantalu.com

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



రాజకీయాలను వీడాలనిపిస్తోంది కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు

5లో



సిక్కుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తాం: మంత్రి కొప్పుల ఈశ్వర్

5లో



## సామాన్యులకు దక్కిన

# గౌరవం

- అట్టహాసంగా ద్రౌపదీ ముర్ము ప్రమాణస్వీకారం
- అత్యున్నత పీఠంపై ఆదివాసీ మహిళ
- రాష్ట్రపతిగా ప్రమాణం చేసిన ద్రౌపది ముర్ము
- ముర్ముతో ప్రమాణం చేయించిన సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ
- హాజరైన వెంకయ్యనాయుడు, మోడీ, నడ్డా తదితరులు
- ప్రమాణానికి ముందు రాజ్‌ఘాట్‌లో గాంధీకి నివాళి

తన ఎన్నిక సామాన్యులకు దక్కిన గౌరవంగా ముర్ము వెల్లడి

అరుదైన ఘనత దక్కించుకున్న జస్టిస్ ఎన్వీ రమణ

రాష్ట్రపతి ప్రమాణ కార్యక్రమానికి దూరగా కెసిఆర్, జగన్

హాజరైన తెలుగురాష్ట్రాల గవర్నర్లు

**న్యూఢిల్లీ,జూలై25:** దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. రాష్ట్రపతి పీఠంపై తొలి గిరిజన మహిళ ద్రౌపది ముర్ముఅత్యతున్నత పీఠం అధిష్టించారు. ఈ క్రమంలో రాష్ట్రపతిగా సోమవారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగిన కార్యక్రమంలో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ద్రౌపది ముర్ముతో ప్రమాణం చేయించారు. భారత దేశ 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము సోమవారం ఉదయం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ముర్ముతో ప్రమాణం చేయించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌తో పాటు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా ముర్ముకు శుభాకాంక్షలు తెలిపారు. ముర్ము రెండో మహిళా రాష్ట్రపతి కాగా.. తొలి గిరిజన రాష్ట్రపతి కావడం విశేషం. రాష్ట్రపతి ముర్ము ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ,

మిగతా 2లో..



## కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే

# అవకాశం లేదు

- వరదలపై రాజకీయం చేయడం మంచిది కాదు
- ప్రభుత్వంపై గవర్నర్ తమిళిసై మరోమారు విమర్శలు
- ప్రోటోకాల్ పాటించడంలో మార్పు రాలేదన్న తమిళిసై
- వరదలను రాజకీయం చేయదల్చుకోలేదని వెల్లడి
- ముర్ముకు పదవి మహిళలకు దక్కిన గౌరవం అని వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై25:** తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, టీఆర్ఎస్ ప్రభుత్వం మధ్య కోల్డ్ వార్ కొనసాగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఈ విషయం బహిర్గతమైంది. ఢిల్లీ వేదికగా గవర్నర్ తమిళిసై.. తెలంగాణ సర్కార్‌పై పరోక్షంగా విమర్శలు కురిపించారు.తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గవర్నర్ తమిళిసై మరోసారి ఫైర్ అయ్యారు. ప్రోటోకాల్‌ను పాటించడంలేదని ఆరోపించారు. సోమవారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మొట్ట మొదటిసారిగా ఒక గిరిజన మహిళ ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అయ్యారని, ఇది దేశం గర్వించదగిన అంశమని అన్నారు. తాను తెలంగాణ ప్రథమ పౌరురాలిగా బాధ్యతతోనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లానన్నారు. ఈ దఫా పర్యటనలో కూడా

మిగతా 2లో..

## అప్పల జాబితాలో ముందు వరసలో

# తమిళనాడు

- అదే దారిలో యూపి, మహారాష్ట్రలు
- ఎనిమిదో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- 11వ స్థానంలో తెలంగాణ రాష్ట్రం
- లోక్‌సభలో ఉత్తమ్ ప్రశ్నకు కేంద్రం వివరణ
- ఆంధ్రప్రదేశ్ అప్పులపై సర్వత్రా ఆందోళన
- 69వేల కోట్ల నుంచి 3.12లక్షల కోట్లకు అప్పులు
- తెలంగాణలో అప్పులే తప్ప అభివృద్ధి శూన్యం
- మండిపడ్డ కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్



**న్యూఢిల్లీ,జూలై25:** అప్పుల జాబితాలో తమిళనాడు ముందు వరసలో ఉంది. ఆ తరవాతి స్థానంలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఉన్నాయి. దేశంలోని ఏయే రాష్ట్రానికి ఎన్ని అప్పులు ఉన్నాయనే దానిపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రం బదులిచ్చింది. రాష్ట్రాల వారీగా అప్పుల జాబితాను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. దీని ప్రకారం.. దేశంలో అత్యధికంగా అప్పులున్న రాష్ట్రాల జాబితాలో తొలి మూడు స్థానాల్లో

మిగతా 2లో..



# ఢిల్లీకి సీఎం కేసీఆర్

## మూడ్రోజుల పాటు హస్తినలో మకాం

## నేడు రాష్ట్రపతి, అమిత్‌షాతో భేటీ అయ్యే అవకాశం

**హైదరాబాద్,జూలై25:** ఢిల్లీ పర్యటనకు సీఎం కేసీఆర్ బయల్దేరారు. ప్రగతి భవన్ నుంచి బయలుదేరిన కేసీఆర్... బేగంపేట విమానాశ్రయంలో ప్రత్యేక విమానంలో హస్తినకు వెళ్లారు. అక్కడే రెండు, మూడు రోజులు సీఎం మకాం వేయనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ పర్యటనకు బయలుదేరారు. హస్తినకు బయలు దేరినట్లు ప్రగతి భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. బేగంపేట విమానాశ్రయంలో ప్రత్యేక విమానంలో హస్తినకు బయల్దేరారు. రెండు, మూడు రోజులు సీఎం ఢిల్లీలోనే ఉండనున్నట్లు సమాచారం. జాతీయ రాజకీయాలపై విపక్షాలతో చర్చించేందుకు కేసీఆర్? ఢిల్లీ వెళ్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ఫలితాలు వెలువడిన అనంతరం కేసీఆర్ ఢిల్లీ వెళ్తుండటంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హస్తినకు చేరుకున్నారు.. ఇక, ఢిల్లీలో

మిగతా 2లో..

### రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా దీపికారెడ్డి

**హైదరాబాద్,జూలై25:** ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి దీపికారెడ్డికి అరుదైన గౌరవం లభించింది. దీపికారెడ్డిని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా

మిగతా 2లో..

# ఇంటింటికీ బూస్టర్ డోసు

కరోనా కేసులు పెరుగుతున్నాయి.. బూస్టర్ వేయించుకోండి


- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- డెంగీ, మలేరియా, టైఫాయిడ్ విజృంభించకుండా చూడాలి
- అధికారులు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలి
- సీజనల్ వ్యాధులపై మంత్రులతో కలసి అధికారులతో హరీష్ సమీక్ష



**హైదరాబాద్,జూలై25:** వర్షాలు తగ్గినా సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు.భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ఛాన్స్ ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు సూచించారు. సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి,ఎర్రబె÷-లలి దయాకర్ రావు,సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, సిఎంస సోమేశ్ కుమార్‌లతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఐదేళ్లకోసారి డెంగ్యూ వ్యాధి విజృంభించే అవకాశం ఉందన్నారు. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల డెంగ్యూతో పాటు మలేరియా, టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా భద్రాద్రి, ములుగు జిల్లాల్లో మలేరియా కేసులు రోజురోజుకూ

మిగతా 5లో..

## ప్రజానాడి





## తెలంగాణ హైకోర్టుకు

# ఆరుగురు జడ్జిలు

## సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

**హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టుకు ఆరుగురు జడ్జిలను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. న్యాయవాదులకు హైకోర్టు జడ్జిలుగా పదోన్నతి కల్పించాలని సూచించింది. సుప్రీంకోర్టు సిఫారసు చేసిన వారిలో ఏనుగుల వెంకట వేణుగోపాల్, నగేష్ భీమపాక, పుల్ల కార్తీక్, కాజా శరత్, జగ్గన్నగారి శ్రీనివాసరావు, నామవరపు రాజేశ్వరరావు ఉన్నారు. తెలంగాణ హైకోర్టు 2019 జనవరి 1వ తేదీన ఏర్పాటైనప్పుడు న్యాయమూర్తుల సంఖ్య 24. ప్రస్తుతం హైకోర్టులో మొత్తం జడ్జిల పోస్టుల సంఖ్య 42కు చేరింది. ఇంతటి భారీ స్థాయిలో న్యాయమూర్తుల నియామకం జరిగేలా చేయటంలో తెలుగు బిడ్డ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

మిగతా 2లో..



# మరో కొత్త మండలం ఏర్పాటు

ఇనుగుర్తి మండలం ఏర్పాటుకు సీఎం కేసీఆర్ ఆదేశం

కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన నేతలు

**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మరో మండలం ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. చారిత్రక ప్రాంతమైన ఇనుగుర్తిని మండలంగా చేయాలని నిర్ణయించిన సీఎం.. ఈ మేరకు కొత్త మండలం ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ చేయాలని

మిగతా 2లో..

## గెలిచిన 12మంది టీఆర్ఎస్‌లో చేరితే కాంగ్రెస్ ఏం చేసింది

- నేను ఏం చేయాలో నాకు క్లారిటీ ఉంది
- సీఎల్పీ అడిగితే ఇవ్వనోళ్లా నన్ను విమర్శించేది
- భట్టి భేటీలో కలసి పనిచేద్దామన్నారు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై కాంగ్రెస్ సీరియస్
- ఆయన వ్యాఖ్యలపై ఆరా తీస్తున్న మాణిగం ఠాకూర్

**హైదరాబాద్,జూలై25:** మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ లోకి వెళ్లినా అధిష్టానం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో తెలంగాణ ఉద్యమకారులెవరూ లేరన్నారు. తెలంగాణలో బీజేపీ పార్టీ బలం పుంజుకుంటుందని గతంలో చెప్పానని, తాను చెప్పినట్లుగానే అదే నిజమైందని చెప్పారు. తన ప్రతిష్టతను దెబ్బతీసేందుకు సీఎం కేసీఆర్

మిగతా 5లో..

# సామాన్యులకు దక్కిన గౌరవం

మొదటిపేజీ తరువాయి..

అన్ని పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు పార్లమెంటు సెంట్రల్ హాల్‌కు చేరుకున్న ద్రౌపది ముర్ముకు సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్వాగతం పలికారు. అక్కడ సైనిక వందనం స్వీకరించారు. అనంతరం ఆమె తొలి ప్రసంగం చేశారు. తన ఎన్నిక దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీకని, బాధ్యతల నిర్వహణకు ప్రజల విశ్వాసం బలాన్నిస్తుందని అన్నారు. దేశ 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాల సమయంలో..రాష్ట్రపతిగా ఎన్నిక కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అందరి విశ్వాసం, సంక్షేమం కోసం పాటుపడదామన్నారు. ఓ సాధారణ ఆదివాసీ అయిన తనను దేశ అత్యున్నత స్థానంలో నిలబెట్టారని అన్నారు. గత రాష్ట్రపతులందరూ ఈ పదవికి వన్నె తెచ్చారని కొనియా డారు. ఈ సందర్భంగా దేశప్రజలకు ద్రౌపది ముర్ము కార్గిల్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ టెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో దేశం దూసుకెళ్తోందని ముర్ము అన్నారు. రాష్ట్రపతిగా దేశవాసులందరికీ తన సేవలు అందిస్తానన్నారు. అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాల్సి ఉందని, 'సబ్ కా ప్రయాస్ సబ్ కా కర్తవ్య్' నినాదం ముందుకు వెళ్లాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కల సాకారం చేయాలన్నారు. ఈ సందర్భంగా దేశప్రజలకు ద్రౌపది ముర్ము కార్గిల్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఊరేగింపుతో ముర్ము సెంట్రల్ హాలుకు చేరుకున్నారు. జస్టిస్ ఎన్వీ రమణ.. రాజ్యాంగంలోని ఆర్టికల్-60 ప్రకారం ఆమెతో ప్రమాణం చేయించారు. ఆ వెంటనే సైన్యం 21 సార్లు గాల్లోకి కాల్పులు జరిపి నూతన రాష్ట్రపతికి గౌరవ వందనం సమర్పించింది. ప్రమాణ స్వీకారానికి ముందు ముర్ము వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత దిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు. అనంతరం.. రాష్ట్రపతి భవన్‌కు వెళ్లగా.. రామ్‌దనాథ్? కోవింద్‌దంపతులు ముర్ముకు అభినందనలు తెలిపారు. రాష్ట్రపతిగా తన ఎన్నిక కోట్లాది భారతీయుల విశ్వాసానికి ప్రతీక అని అన్నారు ముర్ము. ఈ గెలుపు తన ఒక్కరి ఘనత కాదని.. దేశ ప్రజలందరికీ దక్కిన విజయమని అభిప్రాయపడ్డారు. పేద ప్రజలు కలలు కని.. నిజం చేసుకోగలరనేందుకు తన ఎన్నికే నిదర్శనం అని పేర్కొన్నారు. రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి ప్రసంగించిన ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.'దేశ ప్రజల విశ్వాసం నిలబెట్టుకునేందుకు కృషి చేస్తా. భారత్ 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' ఉత్సవాలు జరుపుకుంటోంది. ఉత్సవాల వేళ రాష్ట్రపతిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉంది. 50 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల వేళ నా రాజకీయ జీవితం ప్రారంభమైంది. 75 ఏళ్ల ఉత్సవాల వేళ రాష్ట్రపతిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉంది. ఒడిశాలోని చిన్న ఆదివాసీ గ్రామం నుంచి వచ్చి.. అత్యున్నత పదవి చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు ద్రౌపది. ప్రసంగం తర్వాత రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు ద్రౌపదీ ముర్ము. అక్కడ రాష్ట్రపతిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయంలో రామ్‌నాథ్ కోవింద్ ముర్ము వెంటే ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. అధికారిక ట్విట్టర్ ఖాతాను ముర్ముకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్వీ రమణ అరుదైన ఘనత దక్కింది. రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన తొలి తెలుగు వ్యక్తిగా జస్టిస్ రమణ ఖ్యాతి గడించారు. సాధారణంగా రాష్ట్రపతితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి



ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుతం సీజేఐగా ఉన్న జస్టిస్ రమణ.. ఆ గౌరవం దక్కించుకున్నారు. ఇప్పటివరకు ఏ తెలుగు వ్యక్తి భారత రాష్ట్రపతితో ప్రమాణం చేయించలేదు. రాష్ట్రపతిగా జులై 25న ప్రమాణ స్వీకారం చేసిన 10వ వ్యక్తి ద్రౌపదీ ముర్ము. 1977లో నీలం సంజీవ రెడ్డి జులై 25న భారత ఆరో రాష్ట్రపతిగా జులై 25న ప్రమాణం చేశారు. అప్పటి నుంచి దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించినవారంతా అదే తేదీన బాధ్యతలు చేపడుతున్నారు. ఇప్పుడు 15వ రాష్ట్రపతి ముర్ము కూడా అదే జాబితాలో చేరారు. రాష్ట్రపతి ప్రమాణస్వీకారానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దూరంగా ఉన్నారు. ఆహ్వానం ఉన్నప్పటికీ కెసిఆర్,జగన్‌లో హాజరు కాలేక పోయారు. అయితే ఈ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ గవర్నర్లు బిశ్వభూషణ్ హరిచందన్,తమిళి సై సౌందర రాజన్ హాజరయ్యారు. పార్లమెంట్ సెంట్రల్ హాలులో భారత 15వ రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ద్రౌపదీ ముర్ము చేత ప్రమాణం చేయించారు. దేశంలోని అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎన్నికైన తొలి గిరిజన నాయకురాలిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన రెండో మహిళగా నిలిచారు.అంతేకాదు, రాష్ట్రపతి పదవిని అలంకరించిన అతి పిన్న వయసు మహిళగా కూడా రికార్డుల్లోకి చేరారు. అంతకు ముందు ఉదయం ద్రౌపదీ ముర్ము ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మునికి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నమస్కరించారు. రాజఘాట్ నుంచి తన తాత్కాలిక నివాసానికి తిరిగి వెళ్ళి, అక్కడి నుంచి రాష్ట్రపతి భవన్ కు చేరుకున్నారు. అక్కడ రామ్ నాథ్ కోవింద్ దంపతులు ఆమెకు పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్ భవనంకు వచ్చిన ద్రౌపది ముర్ము ను ప్రధాని మోడీ, ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు, లోకసభ స్పీకర్ ఓం బిర్లా లు పార్లమెంట్ సెంట్రల్ హాల్ కు తీసుకుని వెళ్లారు.

### రాజ్యసభ సభ్యుడిగా ఇళయరాజా ప్రమాణం

సంగీత విద్వాంసుడు ఇళయరాజా రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు ఆయనను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. నలభై రెండేళ్ల మ్యూజిక్ కెరీర్‌లో 1,400కు పైగా సినిమాలకు ఇళయరాజా సంగీతాన్ని సమకూర్చారు. 7 వేలకి పైగా పాటలకు సంగీతం ఇచ్చారు. 20 వేలకు పైగా కాన్సర్ట్స్ నిర్వహించారు. నాలుగుసార్లు జాతీయ అవార్డు అందుకున్నారు. 1988లో అప్పటి తమిళనాడు సీఎం కరుణానిధి.. ఇళయరాజాకి ఇసైజ్ఞాని (సంగీత జ్ఞాని) అనే బిరుదు ఇచ్చారు. కేంద్రం పద్మవిభూషణ్, పద్మభూషణ్‌తో సత్కరించింది. ఇళయరాజా మద్రాస్ ప్రెసిడెన్సీలోని పణ్ణైపురంలో 1943 సంవత్సరం జూన్ 3న పుట్టారు. 14 ఏళ్ల వయసు నుంచే తన అన్నయ్య నడిపే మ్యూజికల్ ట్రూప్‌తో కలిసి పని చేశారు. ఓ ప్రొఫెసర్ దగ్గర వెస్టర్న్ క్లాసికల్ మ్యూజిక్‌లో టెక్నిక్స్ నేర్చుకున్నారు. ఇన్‌స్ట్రుమెంటల్ పర్‌ఫార్మెన్స్ గురించి స్టడీ చేశారు. కర్నాటక సంగీతాన్ని అవపోసన పట్టారు. క్లాసికల్ గిటార్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. లండన్‌లోని ట్రినిటీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ నుంచి సంగీత దర్శకుడు జీకే వెంకటేష్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేసే అవకాశం సంపాదించారు. పలు సినిమాలకు అసిస్టెంట్‌గా పని చేశాక, 1976లో 'అన్నక్కిళి' అనే సినిమాకి సోలో మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేసే చాన్స్ దొరికింది. తమిళ సినీ చరిత్రలో దీన్నో కల్ట్ క్లాసిక్‌గా చెబుతుంటారు. ఆ చిత్రానికి వర్క్ చేసిన తర్వాత ఇక వెనుదిరిగి చూసుకోలేదు

# మరో కొత్త మండలం ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి..

సీఎస్ సోమేశ్ కుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రస్తుతం కేసముద్రం మండలంలో భాగంగా ఉన్న ఇనుగుర్తి కొత్త మండలంగా ఏర్పడనుంది. మహబూబాబాద్ జిల్లాలో ప్రస్తుతం 16 మండలాలు ఉన్నాయి.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది జిల్లాల్లో 13 మండలాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఇనుగుర్తి మండలం ఏర్పాటుకు సీఎం ఆదేశాలు ఇవ్వడంతో ఆ జాబితాలో మరో మండలం చేరనుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 594మండలాలు ఉండగా.. కొత్త వాటితో కలుపుకొంటే ఆ సంఖ్య 608కి చేరనుంది. ఇనుగుర్తి గ్రామానికి చారిత్రకంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఇనుగుర్తిని కేంద్రంగా చేసుకొని కాకతీయులు ఈ ప్రాంతాన్ని పాలించినట్టు చరిత్ర చెప్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న పెద్ద గ్రామాల్లో ఇనుగుర్తి ఒకటి. కాకతీయ రాజులు గ్రామంలో నివాసం ఉండే వారని చెప్తుంటారు. అందుకే ఊరిలో ఎక్కడచూసినా రాతి స్తంభాలపై చెక్కిన శిల్పాలు, నంది విగ్రహం, నాగేంద్రుడి విగ్రహం, ఎత్తైన యాదవరాజుల విగ్రహాలు, శాసనాలు కనిపిస్తాయి. గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, శివాలయం, బ్రహ్మంగారి గుడి, ఆంజనేయస్వామి ఆలయాలను కాకతీయులు నిర్మించారని చరిత్ర చెప్తున్నది.



దేవాలయాలతో పాటు ఇనుగుర్తి చుట్టూ గుంటి, బంగారుకత్వ, ఆరెవాణి, బేడి అనే చెరువులను నిర్మించారు. గుంటి చెరువులో కాకతీయులు నాటిన చెట్లు, రాతి స్తంభాలతో చెరువు మధ్యలో ఉయ్యాల ఉంటుంది. ఇనుగుర్తి నుంచే తొలి తెలుగు దినపత్రికను 1922లో వద్దిరాజు సోదరులు రాఘవరంగారావు, సీతారాంచందర్‌రావు ప్రారంభించారు. ఇనుగుర్తి గ్రామానికి చెందిన వెంకటనారాయణ ఇండియన్ వాలీబాల్ టీమ్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఎంతోమంది క్రీడాకారులు వాలీబాల్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ప్రభుత్వం ఉద్యోగం పొందారు. ఇనుగుర్తి మండలం ఏర్పాటైన సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. కేసీఆర్ నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు మరో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు కవిత, రవిచంద్ర, ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితరులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని, ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే

# అవకాశం లేదు

మొదటిపేజీ తరువాయి..

అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని మండిపడ్డారు. ప్రగతి భవన్ ,రాజ్‌భవన్ గ్యాప్‌పై తానిప్పుడేమీ వ్యాఖ్యానించనని అన్నారు. వరదలకు క్లౌడ్‌బస్టర్ కారణం అన్న సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై తాను బరెస్ట్ కానని, వరదల వల్ల నష్టపోయిన తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తూనే ఉందన్నారు. వరదలవల్ల కలిగిన నష్టంపై కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించానన్నారు. ఇటీవల ప్రధాని హైదరాబాదు పర్యటనలో రాజకీయాలపై చర్చించారా అన్న మీడియా ప్రశ్నకు తాను స్పందించనని గవర్నర్ తమిళి సై సమాధానం ఇచ్చారు.

రాష్ట్రంలో వరదలపై రాజకీయం చేయడం మంచిది కాదు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తెలంగాణకు వచ్చాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధులకు సంబంధించిన వివరాలు ఇచ్చారు. నేను ఎప్పుడూ ప్రజలతోనే ఉంటాను. నైతిక బాధ్యతతోనే వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాను. ఈ క్రమంలోనే వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదించాను. కింది స్థాయి నుంచి వచ్చిన మహిళ.. దేశానికి రాష్ట్రపతి కావడం కేవలం భారత్‌లోనే సాధ్యమైంది. మహిళా రాష్ట్రపతి కింద మహిళా గవర్నర్‌గా పని చేయడం సంతోషంగా ఉందన్నారు.సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం లేదు. రాజ్‌భవన్‌లో సీఎం కేసీఆర్ కలిసిన తర్వాత కూడా ప్రోటోకాల్‌లో మార్పులేదు. వరదల సమయంలో కలెక్టర్ కూడా రాలేదు. మా మధ్య సంబంధాల్లో 'స్టేటస్ కో'నే ఉంది. ఇతర రాష్ట్రాల గవర్నర్లతో నేను పోల్చుకోను. గవర్నర్‌ను కాబట్టి రాజ్‌భవన్‌కే పరిమితం కాను. ప్రజలకు అందుబాటులో ఉండటమే నా లక్ష్యం. నాకు తోచిన రీతిలో వారికి సాయం అందిస్తానని స్పష్టం చేశారు. కాగా, తెలంగాణ గవర్నర్ హోదాలో రాష్ట్రపతి ప్రమాణ స్వీకారానికి తమిళిసై హాజరయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ప్రమాణస్వీకారోత్సవానికి గవర్నర్ హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారానికి హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. చాలా కింది స్థాయి నుంచి వచ్చారని... చాలా సింపుల్ పర్సన్ అని..ఇది మహిళలకు దక్కిన గౌరవంగా చెప్పుకొచ్చారు. మహిళలకు ఒక రోల్ మోడల్ ద్రౌపది ముర్ము అని తెలిపారు. రాజకీయాలు మాట్లాడను...కాగా... గవర్నర్ భవన్‌కు, ప్రగతి భవన్‌కు మధ్య గ్యాప్‌పై స్పందించేందుకు గవర్నర్ నిరాకరించారు. నన్ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారానికి పిలిచారు వచ్చాను. నేను రాజకీయాలు మాట్లాడాను అంటూ గవర్నర్ తమిళిసై మీడియాకు తెలిపారు. భద్రాచలం ఏరియాలో పర్యటనపై గవర్నర్ ఏమన్నారంటే...వర్షాలు వచ్చాయి కాబట్టి వరద ప్రాంతాల్లో తిరిగానని గవర్నర్ అన్నారు. నేను రాష్ట్రానికి ప్రథమ పౌరాలను కాబట్టి ప్రజల దగ్గరికి వెళ్ళాను. వర్షాలలో ఎక్కువగా నష్టపోయిన ప్రాంతాలు ఆదివాసీలో ఉన్న ప్రాంతాలు కాబట్టి భద్రాచలం ఏరియాలో తిరిగాను. మోరల్ సపోర్ట్ ఇవ్వడానికి నేను ప్రజల దగ్గరకు వెళ్ళాను. నేను తెలుగు ప్రజల కోసం పనిచేస్తున్నా. వర్షాలపై రిపోర్టుని కేంద్రం హోంశాఖ మంత్రి ఇచ్చాను... వాళ్లు కేంద్ర బృందాలను పంపించారు. కేంద్ర ప్రభుత్వం తప్పకుండా రాష్ట్రానికి సహాయం చేస్తుంది.. గతంలో వరదలు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం సహాయం చేసింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వర్షాల వల్ల ఎంత నష్టం జరిగిందో కేంద్రానికి ఇచ్చారు.

## తెలంగాణ హైకోర్టుకు

# ఆరుగురు జడ్జిలు

మొదటిపేజీ తరువాయి..

కీలక పాత్ర పోషించారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టాక హైకోర్టులో జడ్జిల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకొన్న ఆయన.. ఇప్పటి వరకు 17 మంది న్యాయమూర్తుల నియామకాలు చేశారు. తాజాగా సిఫార్సు చేసిన ఆరుగురిని కలిపితే 23 మందిని నియమించినట్టు అవుతుంది. కాగా, ఏపీ నుంచి ఒకరు తెలంగాణకు బదిలీ అయ్యారు. జడ్జిల నియామకంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు సీజేఐ పెద్ద పీట వేశారు. అచ్చమైన తెలంగాణ న్యాయవాదులనే జడ్జిలుగా నియమిస్తామని గతంలో చెప్పినట్టుగా తాజాగా ఆచరణలో చూపించారు. తెలంగాణ విషయంలో సీజేఐ ఎన్వీ రమణ ప్రత్యేక శ్రద్ధ చూపటంపై న్యాయవర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో మొన్నటిదాకా 10 జిల్లా కోర్టులే ఉండేవి. సీఎం కేసీఆరే స్వయంగా అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్రశర్మను కలిసి చేసిన వినతితో కోర్టుల సంఖ్య 32కు పెరిగింది. ఇటీవల హైకోర్టులో జరిగిన వేడుకలో సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ప్రసంగిస్తూ, సీఎం కేసీఆర్ న్యాయ వ్యవస్థకు అందిస్తున్న కృషిని కొనియాడారు. గడపగడపకూ న్యాయం చేరేలా దేశంలో ఎప్పుడూ జరగని విధంగా కొత్త రెవెన్యూ జిల్లా కోర్టుల ఏర్పాటుకావటం పట్ల తెలుగువాడిగా గర్విస్తున్నానని చెప్పారు. అనూహ్య స్థాయిలో న్యాయ సంసరణలకు తెలంగాణ శ్రీకారం చుట్టిందని కీర్తించారు. కాగా, హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీజేఐ ప్రతిపాదించగానే సీఎం కేసీఆర్ కార్యరూపంలోకి తెచ్చిన విషయం తెలిసిందే.

## అప్పుల జాబితాలో ముందు వరసలో

# తమిళనాడు

మొదటిపేజీ తరువాయి..

తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఉన్నాయి. వీటి అప్పు సగటున రూ.6 లక్షల కోట్లకుపైనే ఉంది. ఎనిమిదో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కు రూ.3.98 లక్షల కోట్ల అప్పులు, 11వ స్థానంలో ఉన్న తెలంగాణకు రూ.3.12 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. ఇక జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న పశ్చిమ బెంగాల్ కు రూ.5.62 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు రూ.4 లక్షల కోట్లకుపైగా రుణాలు ఉన్నాయి. కేరళ, మధ్యప్రదేశ్ రూ.3 లక్షల కోట్లకుపైగా అప్పులు చేశాయి. రూ.15వేల కోట్లలోపు అప్పులున్న వాటిలో మేఘాలయ, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, సిక్కిం ఉన్నాయి. ఇదిలావుంటే అప్పులపై జగన్ సర్కార్‌కు కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ప్రత్యేక కార్పొరేషన్‌ల ద్వారా తీసుకునే రుణాలను ప్రభుత్వ అప్పులుగానే పరిగణిస్తామని తెలిపింది. టాక్సులు, సెస్‌లను తనాఖాపెట్టి తెచ్చే అప్పులను కూడా.. రాష్ట్ర ప్రభుత్వ రుణాలుగానే పరిగణిస్తామని లోక్‌సభలో కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడించారు. రాష్ట్రం అప్పులు చేయడానికి ఒక పద్ధతి ఉంది. సొంత ఆదాయానికి మించకుండా ఖర్చులు ఉండాలి. అభివృద్ధి కార్యక్రమాల కోసం అప్పులు చేయవచ్చు. అది కూడా... రాష్ట్రాల ఆర్థిక వనరులు, తిరిగి చెల్లించగల స్థోమత ఆధారంగా కేంద్రం అనుమతిస్తుంది. కానీ... జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ఖజానాకు వచ్చే ఆదాయం సరిపోవడంలేదు. కేంద్రం ఇచ్చిన అప్పుల పరిమితి కూడా సరిపోవడం లేదు. అందుకే... కేంద్రానికి తెలియకుండా దొంగదారిలో అప్పులు తేవడంపై రాష్ట్రం దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎస్‌డీసీ) అనే ఒక తప్పుడు మోడల్‌ను సృష్టించింది. కనీసం పైసా కూడా ఆదాయం లేని ఒక కార్పొరేషన్‌ను పేపర్లపై పుట్టించి... మద్యంపై విధించిన అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నును ఆ కార్పొరేషన్‌కు మళ్లించారు. దానినే కార్పొరేషన్ ఆదాయంగా చూపి రూ.23,200 కోట్ల అప్పులు తెచ్చారు. ప్రభుత్వం కార్పొరేషన్లకు గ్యారెంటీలు ఇచ్చి అప్పులు తెచ్చుకుని వాడుకోవడం జగన్ ప్రభుత్వం విధానంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ గ్యారెంటీలు చూసి కార్పొరేషన్లకు అప్పులివ్వొద్దని అటు కేంద్రం, ఇటు ఆర్‌బీఐ బ్యాంకులను హెచ్చరించడంతో ఆ మోడల్‌కి బ్రేక్ పడింది. అందుకే ప్రభుత్వం ఖజానా ఆదాయం మళ్లించే మోడల్స్‌ను తెచ్చారు. గ్యారెంటీ అప్పులు, నాన్ గ్యారెంటీ అప్పులు అన్నీ కలిసి రాష్ట్రంలోని కార్పొరేషన్లకు బ్యాంకులు ఇప్పటికే రూ.2.5 లక్షల కోట్లు ఇచ్చాయి. ఇందులో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, ఏపీ టిడ్కో, విద్యుత్ రంగ సంస్థలు ప్రధానం. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ నెత్తిన రూ.42,000 కోట్ల అప్పు ఉంది. అలాగే, టిడ్కో పేరుతో కూడా రూ.7,000 కోట్ల వరకు ప్రభుత్వం అప్పు తెచ్చింది. విద్యుత్ రంగ సంస్థలది మరో సమస్య. ఆ సంస్థలకు ప్రధాన వినియోగదారు ప్రభుత్వమే. సబ్సిడీ కరెంటు, వ్యవసాయానికి ఉచిత కరెంటు అంటూ ఆ సంస్థలకు ప్రభుత్వం ఏడాదికి దాదాపు రూ.8,000 కోట్ల నుంచి రూ.10,000 కోట్ల వరకు బాకీ పడుతోంది. ఇందులో ఒక్కపైసా కూడా ప్రభుత్వం చెల్లించడం లేదు. ఆ బకాయిలు తీర్చడం కోసం విద్యుత్ రంగ సంస్థలు నాన్ గ్యారెంటీ అప్పులు చేస్తున్నాయి. ఇందుకోసం వీధుల్లో ఉండే కరెంటు లైన్లు, థర్మల్ స్టేషన్లు, సబ్ స్టేషన్లు, ఎ÷-లాంట్లు, ఇతర ఆస్తులు తనఖా పెట్టి అప్పులు చేస్తున్నాయి. వీటిని చెల్లించే భారం కూడా ప్రభుత్వానిదే. పైగా ఈ గ్యారంటీ అప్పులను 2020 మార్చి నుంచి ప్రభుత్వం అప్‌డేట్ చేయడం లేదు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవహారమైతే మరీ దారుణంగా ఉంది. భూముల తనఖాకు, వేలంలో కొనడానికి ఎవరూ ముందుకురాకపోవడంతో నేరుగా ఆ భూములు అమ్మడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. తెలంగాణను కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మర్చారని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఆర్బీఐ నివేదిక ప్రకారం 2014 లో తెలంగాణ అప్పు రూ. 69 వేల కోట్లు ఉంటే..2022 నాటికి రూ.3 లక్షల12 వేల కోట్లకు చేరిందన్నారు. 2014లో ప్రతి మనిషి మీద 18 వేల అప్పు ఉంటే..2022 వచ్చే సరికి ప్రతి మనిషి తలసరి అప్పు లక్ష రపాయలు ఉందన్నారు. కట్టిన ప్రాజెక్టులు కనపడటం లేదు కానీ అప్పులు పెరుగుతున్నాయన్నారు. కార్పొరేషన్ ద్వారా తీసుకునే అప్పులను రాష్ట్ర ప్రభుత్వ అప్పులుగా గుర్తిస్తామని కేంద్రం స్పష్టం చేసిందని చెప్పారు. పెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్ తో సమానంగా తెలంగాణ అప్పులున్నాయని తెలిపారు. జీతాలు ఇవ్వలేని స్థితిలో తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఉందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులతో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావట్లేదన్నారు. మహిళల పథకాలు, ఫీజు రీయింబర్స్మెంట్ కి సంబంధించిన డబ్బులు విడుదల చేయట్లేదని విమర్శించారు. శ్రీలంక పరిస్థితులు భారత్ లో రాకూడదని విదేశాంగ మంత్రి హెచ్చరించారన్నారు. ఇష్టానుసారంగా అప్పులు చేయడం దేశానికి మంచిది కాదన్నారు.

## రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా దీపికారెడ్డి

మొదటిపేజీ తరువాయి..

సీఎం కేసీఆర్ నియమించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ వాసి అయిన దీపికారెడ్డికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'సంగీత నాటక అకాడమీ' అవార్డుతో పాటు ఎన్నో పురస్కారాలు లభించాయి. 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'కళారత్న' అవార్డు, 2016లో తెలంగాణ రాష్ట్ర అవార్డు, దేవదాసి జాతీయ అవార్డు, అక్కినేని నాగేశ్వరరావు స్వర్ణకంకణం, ఎఫ్‌సీసీఐ ఎ÷-లో ఉమన్ అచీవర్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 'కీర్తి' పురస్కారం, దూరదర్శన్ ఏ-టాప్ గ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు, రీజినల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు, నంది సినిమా అవార్డుల జ్యూరీ, తెలంగాణ ఉగాది పురస్కారాల సెలక్షన్ కమిటీ సభ్యురాలిగా పనిచేసిన అనుభవం ఉంది. దీపికారెడ్డి భర్త శ్యాంగోపాల్ రెడ్డి బిజినెస్‌మ్యాన్. వారికి ఇద్దరు పిల్లలు.. అమ్మాయి శ్లోకారెడ్డి కూచిపూడి నృత్య కళాకారిణి కాగా.. అబ్బాయి అభినవ్ టెన్నిస్ ఆటగాడు.

# రాష్ట్రపతి అంటే రబ్బర్ స్టాంప్

### ఇందిర హయాం నుంచే బలపడ్డ నానుడి

న్యూఢిల్లీ,జూలై25: రాష్ట్రపతి- రబ్బర్ స్టాంప్' అయ్యారన్న అపవాదు దివంగత ప్రధాని ఇందిర హయాం నుంచే ప్రచారం అయ్యింది. ఆమె సూచనమేరకు ఆనాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అహ్మద్ ఎమర్జెన్సీ విధించారు. అలాగే రాష్ట్రపతుల ఇందిరకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలను తీసుకునే వారు కాదు. ఆమె ఏదీ చెప్పినా చేశేవారు. దీంతో ఆనాటి నుంచి రాష్ట్రపతి రబ్బర్ స్టాంప్ అంటే చెప్పిందిచేయడం అన్నమాట రూఢి అయ్యింది. రాష్ట్రపతి పదవి రబ్బర్‌స్టాంప్ వంటిదన్న పేరు చిరకాలంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు ఆమోదముద్ర వేయడం తప్ప ప్రత్యేక అధికారాలు ఏమీ లేవన్న ఉద్దేశంతో ఇలాంటి అభిప్రాయం ఏర్పడింది. రాష్ట్రపతులుగా బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుసేన్, వి.వి.గిరి హయాముల్లో ఇలాంటి వాదన వినిపించలేదు. అనంతరం ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ హయాంలో ఈ పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. అప్పట్లో ఇందిరాగాంధీ ప్రభుత్వం వివిధ అంశాలకు సంబంధించి తరచూ ఆర్డినెన్స్‌లను జారీ చేసేది. విధి నిర్వహణలో భాగంగా వాటిని రాష్ట్రపతి ఆమోదించేవారు. 1975 జూన్‌లో నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో అత్యయిక పరిస్థితిని విధించింది. ఈ నిర్ణయానికి ఆమోదం కోసం ఆమెతో పాటు, నాటి న్యాయశాఖ మంత్రి సిద్దార్థ శంకర్ రే రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్‌ను కలిశారు. దేశ భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఇలాంటి కీలక అంశాలపై రాష్ట్రపతి ఆచితూచి వ్యవహరించాలి. అనేక కోణాల్లో విస్తృతంగా ఆలోచించాలి. న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలి. తనకు గల సందేహాలపై ప్రభుత్వం నుంచి వివరణ తీసుకోవాలి. గతంలో న్యాయవాదిగా, అస్సాం ప్రభుత్వంలో అడ్వకేట్ జనరల్ (ఏజీ)గా కూడా పనిచేసిన ఆయన ఈ విషయాల గురించి ఏమీ ఆలోచించలేదు. ఇందిరాగాంధీ పట్ల ఉన్న విధేయతతో అత్యయిక పరిస్థితి ప్రకటనపై సంతకం చేశారు. ఆ తర్వాత ఈ నిర్ణయం దేశాన్ని కుదిపేసింది. అప్పటి నుంచి రాష్ట్రపతి రబ్బర్‌స్టాంప్ అన్న అభిప్రాయం బలపడిపోయింది.

# ఢిల్లీకి సీఎం కేసీఆర్

మొదటిపేజీ తరువాయి..

బిజీ బిజీగా గడపనున్నారు.. మొదటగా మంగళవారం రోజు కొత్త రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వంగా కలిసి అభినందనలు తెలపనున్నారు.. ఆ తర్వాత కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సహా పలువురు కేంద్ర మంత్రలతో సమావేశం కానున్నారు.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి రాష్ట్రంలో వరదల వల్ల కలిగిన నష్టాన్ని వివరించనున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి.. కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ అధీనంలో ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ విభాగం ఉండడంతో.. ఆయన అమిత్‌షాతో ప్రత్యేకంగా సమావేశమైన తెలంగాణలో వరదలు.. వాటివల్ల కలిగిన నష్టం గురించి వివరించనున్నారు. ఇక, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను కూడా కలిసి రాష్ట్రంలో వరదలు సృష్టించిన భీభత్సం గురించి వివరించబోతున్నారు తెలంగాణ సీఎం కేసీఆర్.. కేంద్రం విడుదల



చేయాల్సిన పెండింగు నిధుల పై కూడా చర్చించనున్నారు.. ఇరువురు కేంద్ర మంత్రుల తో జరిగే భేటీల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సహా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, పలువురు టీఆర్ఎస్ ఎంపీలు పాల్గొనే అవకాశం ఉంది. తెలంగాణలో ఇప్పటికే కేంద్ర బృందాలు పర్యటించారు.. వరద వల్ల ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేశాయి.. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ నష్టం కలిగిన విషయం తెలిసిందే.. ఇక, ఎప్పుడూ లేనంతగా కడియం ప్రాజెక్టుకు వరద వచ్చిన విషయం తెలిసిందే.. కాగా, రెండు మూడ్రోజుల పాటు హస్తినలోనే మకాం వేయనున్నారు కేసీఆర్.. తన పర్యటనలో విపక్షాలకు చెందిన జాతీయ నేతలను కలవనున్నారు.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇచ్చే విషయంపై కూడా క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది.. ఇప్పటికే తెలంగాణ గవర్నర్ తమిళిసై.. ఢిల్లీలోనే ఉన్నారు.. ఆమె కూడా పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉంది.. ఈ నేపథ్యంలో.. కేసీఆర్ హస్తిన టూర్ ఆసక్తికరంగా మారింది.

# నేరెళ్లలో వైద్య ఆరోగ్య శిబిరం

**ధర్మపురి జూలై 25 (ప్రజా మంటలు) :** నేరెళ్ల గ్రామంలో మండల వైద్య అధికారి,



జిల్లా ఉప వైద్యాధికారి డా.ఎన్ .శ్రీనివాస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేరెళ్ల వైద్యాధికారి డా.అవంతి ఆధ్వర్యంలో వైద్యఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి మందులు ఇవ్వడంతో పాటు జ్వరం వచ్చిన వారికి రక్త నమూనాలు సేకరించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అత్యధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య సిబ్బంది అన్ని గ్రామాల్లో ప్రజలకు వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, ప్రతిరోజు ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించి చికిత్సనందించలేదని తెలిపారు. కార్యక్రమంలో నేరెళ్ల గ్రామ సర్పంచ్ పలిగిరి వసుంధర సత్యం, ఎంపీటీసీ రెడ్డవేణి సత్యం, హెల్త్ ఎక్స్‌టిషన్ అధికారి ఎ.రాజేశం, హెల్త్ సూపర్‌వైజర్ అనితకుమారి, వెంకటేష్, ఏఎన్‌ఎంలు శారద, సుగుణాశావర్కర్లు శారద, మమత, జ్యోతి, సమత, మరియు గ్రామ ప్రజలు ఉన్నారు.

# మహిళలకు ప్రకృతి ప్రసాదించిన వరం - ఆరోగ్య ప్రదాయిని గోరింటాకు

**జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత**

**జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు):** మహిళలకు ప్రకృతి ప్రసాధించిన వరం



గోరింటాకు అని జెడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. పిఆర్టీయూ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల ఓల్డ్ హై స్కూల్లో ఆషాడ మాస గోరింటాకు ఉత్సవాల్లో జడ్పీ చైర్పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ%ూ%. ప్రతీ శుభ కార్యాల్లో గోరింటాకుకు ప్రత్యేకత ఉంటుందని అన్నారు. శరీరంలోని వేడిని గ్రహించి చల్లదనాన్ని ఇస్తుందనీ అంతేకాకుండా చర్మ వ్యాధులకు సంబంధించిన రోగాలు రాకుండా కాపాడుతుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా మహిళలందరూ గోరింటాకును ఇష్టపడతారని వసంత సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గాయిత్రి, ఉపాధ్యాయురాల్లు జానకి, జమున, అనిత, వసంత, చందన, విద్యా, రాధ, నాగ రాణి, సరోజ, శ్రీదేవి, జయశ్రీ, రచన తదితరులు పాల్గొన్నారు.



**ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగిత్యాల పట్టణ నూతన మాస్టర్ ప్లాన్ పై చర్చలు జరిపిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ భోగ శ్రావణి. ఈ సందర్భంగా వచ్చే 20 సంవత్సరాలకు అనుకూలంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ స్వరూపరాణి, టీ.పి.ఎ స్, శాం సుందర్, కౌన్సిలర్లు కూసరి అనిల్, రాజేష్ పట్టణ అధ్యక్షులు గట్టు సతీష్, బాలే శంకర్, తిరుమలయ్య పాల్గొన్నారు.**

# ఆదుకుంటే సాధించింది

**ఐదు మల్టి నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన యువతి అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల / రాయికల్ జూలై 25 (ప్రజామంటలు):** జగిత్యాల నియోజకవర్గ రాయికల్ పట్టణానికి చెందిన రుద్ర రచన చిన్ననాడే తల్లి దండ్రులనీ కోల్పోయినా కష్టపడి ఇ



సెట్ లో మంచి ర్యాంక్ సాధించి సిబిఐటి లో సీటు సాధించి కళాశాల, హాస్టల్ ఫీజు కట్టలేని స్థితిలో ఉండి కెటిఆర్ కు తన పరిస్తితిపై ట్విట్టర్ ద్వారా ట్వీట్ చేయగా స్పందించిన కేటీఆర్ కళాశాల, హాస్టల్ ఫీజు చెల్లించడమే కాక పూర్తి భాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చి తన భాధ్యత నెరవేర్చగా కేటీఆర్ సహకారంతో చదివి నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలో 5 మల్టీ నేషనల్ కంపనీ లలో ఉద్యోగం సాధించిన 'రచన'. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాద పూర్వకంగా కలవగా రచనను శాలువతో సత్కరించి, అభినందించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. వెంట నాయకులు అంజయ్య గౌడ్, తిరుపతి గౌడ్, తదితరులు ఉన్నారు.

# మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, బ్రోకర్ల తో పైరవీల దందా

**నివాసితులకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని డిమాండ్**

**కుత్బుల్లాపూర్ 25 జూలై (ప్రజామంటలు):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోగల మల్లంపేట జవహర్లాల్ నెహ్రు నేషనల్ అర్బన్ రినివల్ మిషన్ కి చెందిన ఇందిరమ్మ గ్రూహాలలో నివసిస్తున్న నిరుపేద ప్రజలకు అలాట్మెంట్ లెటర్స్ పట్టాలు ఇవ్వాలని నిర్వాసితులు స్థానికులు కోరుతున్నారు. అనేక సంవత్సరాలుగా ఇందిరమ్మ గృహాలలో నిరుపేద కూలీలు అరువై కుటుంబాలు ఏలాంటి సౌకర్యాలు లేనప్పటికీ జీవితం గడుపుతున్నారని టీఆర్ఎస్ నేత తెలంగాణ స్టేట్ మున్సిపల్ స్వచ్ఛ ఆటో టిప్పర్ మరియు రిక్షా డ్రైవర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఏత్తరీ గోపి తెలిపారు. సోమవారం ఏత్తరీ గోపి మీడియాతో మాట్లాడుతూ.... ఇందిరమ్మ గృహాలలో నివసిస్తున్న నిరుపేదలపట్ల ఏలాంటి కనికరం లేకుండా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం లోనీ సూపరింటెండెంట్ హౌసింగ్ సెక్షన్ లో రఘనందన్ రెడ్డి అనే ఉద్యోగి ఎన్ఎన్ యుఆర్ఎం మరియు ఆర్ జి కె మొత్తం పైరవీల బ్రోకర్లతో దందా నడుపుతున్నాడని, ఒక్కొక ఇంటికి చొప్పున 50 వేలు తీసుకుని అలాట్మెంట్ లెటర్స్ పట్టాలు ఇస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మల్లంపేట సర్వే నెంబర్ 170 లో 2006 నుంచి 2012 ఈ గృహాలు జీహెచ్ఎంసీ హౌసింగ్ వాళ్ళు నిర్మించడం జరిగిందని గోపీ వివరించారు. అయితే అనేక సంవత్సరాల నుండి ఈ ఇందిరమ్మ గృహాలలో కూలీలు రాళ్ళు కొట్టుకునే వారు విద్యుత్, మంచి నీరు, డ్రైనేజీ వసతులు లేనప్పటికి ఎన్నో కష్టాలు పడుతూ బతుకుతున్నారని ఆయన తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో హౌసింగ్ సెక్షన్ లో విధులు నిర్వహిస్తున్న రఘునందన్ రెడ్డి కొంత మంది బ్రోకర్ల తో కుమ్మక్కై కార్లు, జెసిబి లు ఉన్న వ్యక్తులకు 50 వేల చోప్పున అలాట్మెంట్ లెటర్స్ పట్టాలు ఇచ్చారని,ఒక్కో ఆధార్ కార్డుకి రెండేసి చొప్పున ఈ ఇళ్ళు కేటాయించారని ఏత్తరీ గోపి ఆరోపించారు. గత మార్చి (03-03-2022) మూడవ తేదీన అలాట్మెంట్ లెటర్స్ పట్టాలు ఎవరికైతే ఇచ్చారో అవి తక్షణం అధికారులు రద్దు చేయాలని, ఇందిరమ్మ గృహాలలో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని






ఏత్తరీ గోపి తో పాటు నివాసితులు హనుమంతమ్మ, భాగ్యలక్ష్మి, రజిత, వరలక్ష్మీ, సుజాత, రోజా, లిఖిత, సమీపాన, నర్సమ్మ తదితరులు డిమాండ్ చేశారు. కూకట్ పల్లి, ఐడిపిఎల్ కాలనీ, కౌకూర్, పాపిరెడ్డి నగర్ చందా నగర్ లో వాంబే కాలనీలలో ఎవరైతే కబ్జా చేశారో వాళ్లకే అలాట్మెంట్ లెటర్స్ పట్టాలు ఇవ్వడం జరిగింది. అదే విధంగా ఇందిరమ్మ గృహాలలో నివసిస్తున్న ప్రజలకు కూడా పట్టాలు ఇవ్వాలని వారందరు డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి గా కేసీఆర్, మంత్రి కేటిఆర్, స్థానిక ఎమ్మెల్యే వివేక్ నందా తక్షణం తగు చర్యలు తీసుకొని నివాసితులను ఆదుకోవాలని కోరారు.

# తెలంగాణ రాష్ట్రంలో కుల వృత్తులకు అభివృద్ధికి ప్రాధాన్యం

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ 10వ వార్డు ఎలుక భావి వాడ గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని గంగపుత్ర సంఘ సభ్యులకు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్ లో అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. అనంతరం మాట్లాడుతూ.... గంగ పుత్రుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టు బడి ఉందని, అన్ని కుల వృత్తుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసిఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మిషన్ కాకతీయ లోభాగంగా చెరువు పూడిక తీసి,కట్టలు సరిచేసామని, కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రం లో అన్ని చెరువులు జల కళ ను సంతరించుకున్నాయి అని, చెరువుల్లో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేశామని, రాష్ట్రంలో మత్స్య సంపద పెంచామని అన్నారు. గంగ పుత్రులకు లైఫ్ జాకెట్స్, మోటార్ సైకిళ్ళు, గూడ్స్ వాహనాలు సైతం పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి ది అని, అన్ని కుల సంఘ భవనాలు నిధులు కేటాయించామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అని అన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు నమ్మి మోసపోవద్దు అని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కళ్ళ ముందు కనిపిస్తుంది అని, ప్రతి పక్షాలని వట్టి ఆరోపణలే అని, ప్రజలు గమనించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, రాష్ట్రం నుండి వెళ్ళే వలసలు తగ్గాయి అని,నేడు ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ కు ఉపాధి నిమిత్తం వలసలు పెరిగాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు సిరికొండ భారతి రాజయ్య, ఆరుముళ్ల నర్సమ్మ, రాజ్ కుమార్, ఎఫ్.సి.ఎస్. అధ్యక్షులు గుమ్మల అంజయ్య, డైరెక్టర్ ఆరుముల్ల పవన్,



ఎంపీటీసీ భూపెల్లి శ్రీనివాస్, నాయకులు జుంబర్తీ రమేష్, నాచుపల్లి రెడ్డి, నారాయణ, కిరణ్, నరేందర్, నర్సయ్య, గంగారజం, రాజం, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

**భీమదేవరపల్లి జూలై 25 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యపూర్ మాజీ సర్పంచ్ అచ్చ నారాయణ, వనపర్తి మల్లయ్య, గాంధీనగర్ లో రాంపల్లి వెంకటమల్లయ్య, కొక్కుల రవీందర్ మరియు కొత్తపల్లి సీనియర్ కాంగ్రెస్ నేత పత్తిపాక కోమురెల్లి తల్లి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ూ%. ఆయా కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తూ, వారి మరణం తీరని లోటని తన ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలిపి మనోధైర్యాన్ని కల్పించారు. వారి వెంట మాణిక్యపూర్ గ్రామ ఎంపిటిసి గోపి శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కేతిరి లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ సదానందం, గాంధీనగర్ గ్రామ ఉప సర్పంచ్ అనపురం శ్రీనివాస్, వార్డు సభ్యులు మాదం సుమన్, మండల కాంగ్రెస్ నాయకులు భీమ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కొమురెల్లి, రామచంద్రం, శంకర్ యూత్ కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ కార్యదర్శి గడ్డం శివ, పిల్లి సంపత్, ఐలబోయిన సాంబయ్య, రాంపల్లి సాంబయ్య, ఎదులాపురం సాంబయ్య, మాసినపెల్లి శ్రీనివాస్, రామారపు లింగయ్య, ఏనుగుల సమ్మయ్య, బండారి లక్ష్మయ్య, గడ్డం కనకయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలి

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కవులు కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ జి. కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక వ్యవస్థాపకులు పెట్లోజు సోమేశ్వరాచారి, టిపా కార్యదర్శి చిలుమోజు సాయికిరణ్, ఎం.ఎస్.పి. జనగామ జిల్లా ఇంచార్జి ఇనుముల నర్సయ్య మాదిగ, టౌన్ ఇంచార్జి గువ్వల మాదిగ, వి.హెచ్.పి.ఎస్. జనగామ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి కుమార్ అన్నారు. స్థానిక జనగామ జిల్లా కేంద్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎంఆర్పిఎస్, ఎం.ఎస్.పి, వి.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యంలో జనగామ మండల ఇంచార్జి నిర్మల భాస్కర్ మాదిగ అధ్యక్షత న నిరసన దీక్షలు 5 వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు మేం అనుకూలం అంటూనే 28 ఏళ్లుగా మద్దతు ప్రకటిస్తూ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు నెరవేర్చలేదని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న కేంద్రప్రభుత్వ నిరసిస్తున్నామని, బిజెపి మూల సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ స్ఫూర్తి కనుగుణంగానే పార్టీ నడుస్తోందని చెప్పుకునే బీజేపీ నేతలు పండిట్ దీన్ దయాల్



స్ఫూర్తి అనుగుణమైన వర్గీకరణపై అణిచివేత ధోరణి ఎందుకని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డోలు దెబ్బ నాయకులు జోగు కృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళి నగేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కౌడగొని మహేందర్, ఉపాధ్యక్షుడు గడ్డం సోమరాజు, నాయకులు ఉడుత అనిల్, దరవత్ శ్రీను, కన్నారపు పరుశరాములు, మండల ఇంచార్జి నిర్మల భాస్కర్, జనగామ టౌన్ బికెఎంయు జిల్లా సహాయక కార్యదర్శి నల్ల పెద్దమైసయ్య, బక్క వివేక్, అనిల్ మాదిగ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నగేష్ మాదిగ, నాయకులు పాలమకుల శ్రావణ్ మాదిగ, బక్క వివేక్ పాల్గొన్నారు.

## చిరుతపులుల సంచారం భయాందోళనలో రైతులు, గ్రామస్తులు

**హుస్నాబాద్ జూలై 25 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం ధర్మారం, కొండరాజుపల్లి గ్రామాల మధ్య చిరుతపులుల సంచారం కలకలం రేపుతోంది. రాత్రివేళ అటుగా వెళుతున్న వాహనదారులకు రెండు చిరుతపులులు తారస పడటంతో వెంటనే ఆ దృశ్యాలను వారి సెల్ ఫోన్లలో వీడియో తీశారు. చిరుతల సంచారం పై గ్రామస్తులు సమాచారం ఇవ్వగా అటవీశాఖ అధికారులకు తెలిపినట్లుగా పోలీసులు వెల్లడించారు. చిరుతల సంచారంతో రైతులు, గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.



# గంజాయి నిర్మూలించాలని ఎస్.ఐ. కి వినతిపత్రం

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** తెలంగాణ విద్యార్థి పరిషత్



ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో గంజాయిని సమూలంగా నిర్మూలించాలని కోరుతూ జనగామ పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వినతి పత్రం సోమవారంనాడు అందజేశారు. ఈ సందర్భంగా టిజివిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల సురేష్ మాట్లాడుతూ.... రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి వలన ఎంతో మంది విద్యార్థులు, యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, కొంత మంది ముఠాలుగా ఏర్పడి కళాశాల విద్యార్థులు యువకులను టార్గెట్ చేసుకుని గంజాయిని అలవాటు చేయడం దారుణమన్నారు. గంజాయికి బానిసై తల్లిదండ్రులకు పెనుభారంగా మారుతున్నారని అన్నారు. గంజాయి ముఠాల పై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గన్ను కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీస్వయంభూ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న టిఎన్జీవోస్ కాలనీ ఫేస్-2 సభ్యులు

**భీమదేవరపల్లి జూలై 25 (ప్రజామంటలు):** హనుమకొండ టిఎన్జీవోస్ కాలనీ ఫేస్-2 డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ సభ్యులందరూ



ఆషాడ మాసం సందర్భంగా వేలేర్ మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో గుట్టపై కొలువుదీరిన శ్రీ స్వయంభు మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, ఏనుగు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసంలో వచ్చే తొలకరి వర్షాల తరువాత గ్రామీణ ప్రాంత సాంప్రదాయం ప్రకారం దేవాలయాన్ని సందర్శించుకుని, ప్రజలు నిర్వహించామని తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మల్లికార్జున స్వామిని కోరుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు దేవేందర్ రావు, రఘునాధ్ రెడ్డి, లక్కిరెడ్డి శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మధుకర్ రావు, పాలకుర్తి సదానందం, భీమన్న, దేవిసింగ్, సంపెట రాఘవులు, కిరణ్, రామచంద్ర రెడ్డి, రామ్ గోపాల్ రెడ్డి, రమేష్, మహేందర్, రాచర్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ గూడెం వాగుపై బ్రిడ్జి నిర్మించాలని సి.పి.ఐ. వినతి

**లింగాల ఘనపురం జూలై 25 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల నుండి పాలకుర్తి వెళ్లేదారిలో పటేల్ గూడెం కుందారం మధ్యలో బ్రిడ్జి నిర్మించాలని సిపిఐ పార్టీ లింగాల ఘణపురం మండల కార్యదర్శి రావుల సదానంద్ కోరారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్డాం పై ప్రవహిస్తున్న వర్షం నీరు గత కొన్ని సంవత్సరాల నుండి వర్షాకాలం వచ్చినప్పుడల్లా అటు నుండి ఇటు ఇటు నుంచి అటు దాటనివ్వ కుండా ప్రవహిస్తుందని అన్నారు. ఈ దారి గుండా సుమారు 15 గ్రామాలు జనగామ జిల్లాకు జీవనోపాధి కొరకు వస్తారని, రైతులు ఎరువులకు, స్కూల్, కాలేజీలకు విద్యార్థులు, ఉద్యోగస్తులు, కార్మికులు కర్షకులకు ప్రయాణం చేస్తారని, వర్షాలు వస్తే చాలా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి ఒక బ్రిడ్జిని నిర్మించాలని రావుల సదానంద్ కోరారు.



# లింగాల ఘనపురం మండలంలో ప్రారంభమైన విఆర్ఎ ల దీక్షలు

**లింగాల ఘనపురం జూలై 25 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం కేంద్రంలో గ్రామ రెవిన్యూ సహాయకులు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న



తీవ్ర జాప్యానికి నిరసనగా సదరు హామీలను వెంటనే నెరేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలలో భాగంగా సోమవారం నుండి నిరవధిక దీక్షను ప్రారంభించినట్లు విఆర్ఏ ల మండల అధ్యక్షుడు పాశం యాకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాళ్ల రాఘవరెడ్డి హాజరై ముఖ్యమంత్రి హామీని వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో నిరసనలను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా లింగాలఘనపురం మండల తశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసుకోగా విఆర్ఏ ల జెఏసి జనగామ జిల్లా కన్వీనర్ జగ్గం కృష్ణ దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అజీముద్దీన్, బోడ అనిల్,రాజు, సాయిలు భాగ్యాలక్ష్మి, సంధ్యాకిరన్, బోనగిరి లక్ష్మీ, కోతి సుజాత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర లిఖించిన భారత ప్రజాస్వామ్యం !

భారత ప్రజాస్వామ్యం తలెత్తుకుని నిలిచేలా....సామాన్యురాలు..అసామాన్యురాలిగా ఎదిగిన ఓ చరిత్రను భారతదేశం లిఖించుకుంది. ప్రజాస్వామ్యంలో సామాన్యులూ అసామాన్యులుగా మారుతారనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఎక్కడో మారుమూల ఒడిషాలోలోని ఓ గిరిజన గ్రామంలో పుట్టిన ఓ సామాన్య గిరిజన మహిళ అత్యున్నత రాష్ట్రపతి పీఠం అధిష్టించారు. ఆజాదీకా అమృతోత్సవం జరుపుకుంటున్న వేళ ఈ ఘనట జరగడం కాకతాళీయమే అయినా భారత ప్రజాస్వామ్య పరిమళాలను చాటింది. ఈ దేశంలో మాత్రమే అత్యున్నత పీఠాలను సామాన్యులు అధిష్టించగలరని నిరూపించారు. మనదేశ ప్రజాస్త్వామ్యం గురించి చులకనగా మాట్లాడే వారికి ఇదో చెంపపెట్టు. ప్రతిభ ఉంటే కులమతాలకు అతీతంగా అత్యున్నత పీఠంపై ఎవరైనా అదిష్టగలరని మరోమారు రుజువయ్యింది. ఇంతకు మునుపు ఉన్న రామ్‌నాథ్ కోవింద్ కూడా సామాన్య దళిత కుటుంబం నుంచి వచ్చిన వారే. ఇంతవరకు ఉన్న రాష్ట్రపతులతో పోలిస్తే ద్రౌపది ముర్ము మరింత ప్రత్యేకత సంతరించుకున్నారు. ఓ సామాన్య గిరిజన మహిళగా ప్రస్థానం మొదలైన ఆమె జీవితం అంచెలంచెలుగా ఎదిగిన తీరు మనం గమనించాలి. అందుకే ఆదివాసీ మహిళగా ముర్ము అద్భుతం సృష్టించారు. భారత ప్రథమ పౌరురాలిగా రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించిన తొలి గిరిజన మహిళగా చరిత్ర సృష్టించారు. భారత 15వ రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము ఉన్నత స్థానంపై అధిష్టించిన వేళ మనమంతా గర్వపడాలి. అడవిలో పుట్టి అత్యున్నత పదవికి ఎంపికైన తొలి ఆదివాసీ మహిళగా ద్రౌపది ముర్ము కొత్త చరిత్ర లిఖించారు. గతంలో ప్రతిభా పాటిల్ తొలి మహిళా రాష్ట్రపతిగా రికార్డు సృష్టించగా.. ఇప్పుడు ముర్ము తొలి ఆదివాసీ మహిళా రాష్ట్రపతిగా ఎన్నికై సరికొత్త అధ్యాయానికి తెర తీశారు. 2007 నుంచి 2012 వరకు ప్రతిభా పాటిల్ మొదటి మహిళా రాష్ట్రపతిగా సేవలందించగా.. అత్యున్నత పదవి అధిరోహించిన ద్రౌపది ముర్ము 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు.ఇదే సందర్భం లో దేశ ఆజాదీకా అమృత్ మహోత్సవాలు జరుపుకోవడం విశేషం. అయితే కేవలం ముర్మును రాష్ట్రపతిని చేసిన ఘనత బిజెపిదే అయినా.. ఇప్పుడు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంది. దేశంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఆదివాసీల భూసమస్యను పరిష్కరిం చాలి. అడవితో వారికున్నఅనుబంధాన్ని తెంపేందుకు చేస్తున్నప్రయత్నాలను అడ్డుకోవాలి. విద్యైవద్యానికి వారిని చేరువ చేయాలి. గిరిజనల సంక్షేమంకోసం పత్యేక కార్యాచరణ చేయాలి. తాము గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామనినిరూపించాలి. నిన్న మొన్నటి వరు కనీసం కరెంటు కూడా లేని కుగ్రామంలో పుట్టిన ద్రౌపది ముర్ము.. ఇప్పుడు దేశ అత్యున్నత పదవి చేపట్టినందుకు కానుకగా తమకు ఈ సమస్యలు పరిష్కారం అయ్యాన్న భరోసా వారిలో నింపాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 11 సంవత్సరాల తరువాత అంటే 1958 జూన్ 20వ తేదీన ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లాలోని బైదాపోసి గ్రామంలో ద్రౌపది ముర్ము జన్మించారు. ఆమె తండ్రి బిరంచి నారాయణ్ తుడు. ఆయన సంతాల్ ఆదివాసితెగకు చెందినవారు. ఈ తెగ వందల ఏళ్లుగా మనదేశంలో ఉన్నట్టు చరిత్ర చెబుతోంది.అంతేకాదు.. సంతాల్ తెగ వీరులను భారతదేశ మొదటి స్వాతంత్ర్య పోరాట యోధులుగా కూడా పిలుస్తారు. అలాంటి తెగ నుంచి వచ్చిన ద్రౌపది ముర్ము ఇప్పుడు దేశ రాష్ట్రపతి అయ్యారు. ద్రౌపది ముర్ము భర్త పేరు శ్యామ్ చరణ్ ముర్ము. ముర్ము దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే భర్తతో పాటు, ఇద్దరు కుమారులను కోల్పోవడ ఆమె జీవితంలో విషాదం. టీచర్ గా జీవితం



మొదలుపెట్టిన ద్రౌపది ముర్ము... తర్వాత బీజేపీలో చేరి వివాదాలు లేని నాయకురాలిగా గుర్తింపు పొందారు. ఇంతకన్నా గొపప విషయం మరోటి ఉండదు. అదే ఆమెను అత్యున్నత స్థాయికి చేర్చింది. ఇవాళ సగౌరవంగా ఆమె భారత రాష్ట్రపతిగా అధ్యక్షస్థానం స్వీకరించారు. భారతీయ జనతాపార్టీ కేవలం ఓట్ల కోసమే ఆదివాసీ మహిళకు అత్యున్నత రాష్ట్రపతి గౌరవం ఇస్తున్నదన్న విమర్శలు ఎలా ఉన్నా.. ఆ ప్రయత్నం చేసినందుకు బిజెపిని అభినందించాల్సిందే. దళిత ముఖ్యమంత్రి ప్రతిపాదన చేసిన కెసిఆర్ కూడా ఇలాంటి ఆలోచన చేయ లేదు. విపక్షాలు ఇలాంటి ఆలోచన చేయలేదు. వారు ఎంతసేపు బిజెపికి వ్యతిరేకంగా ఓ అభ్యర్థిని నిలబెడదామనుకున్నారే తప్ప మరోటి కాదు. ఓట్ల కోసమే బిజెపి ఎస్టీ అభ్యర్థిని నిలబెట్టారని విమర్శలు వినిపిం చాయి. అయినా ముర్ము ఎంపికలో తప్పుపట్టవలసింది ఏమీ లేదు. వివిధ సామాజిక శ్రేణులు తమ ప్రాబల్యం పెంచుకోవడానికే వీలుగా వారికి రాజకీయాల్లో, అధికారంలో ప్రాతినిధ్యాన్ని, భాగస్వామ్యాన్ని కల్పించాల్సిందే. అప్పుడే వారికి ఈ దేశ ప్రజాస్వామ్యంపైనా,వ్యవస్థలపైనా నమ్మకం కలుగుతుంది. ఎల్లవేళలా ఒకటి రెండు వర్గాలు మాత్రమే అధికారానికి చేరువ కావడం కూడా సరికాదు. ఆదివాసులను సమీకృతం చేయడానికి వారు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నంలో ఇది కూడా ఒక భాగం. గిరిజనులను అత్యున్నత స్థానంలో ప్రతిష్ఠించడం ద్వారా వారిలో గూడుకట్టుకుని ఉన్న అభద్రతను తొలగించుకోవచ్చు. ఓట్ల కోసం ఆయా శ్రేణులను ఆకట్టు కోవడానికి గత నాలుగు దశాబ్దాల నుంచి పాలకపక్షాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. వారంతా ఈ దేశ ప్రజలే అని, ఈ మట్టి మనుషులే అని గుర్తించాలి. దూరదృష్టితో ఇందిరాగాంధీ జ్ఞానీ జైల్‌సింగ్‌ను రాష్ట్రపతి చేశారు. శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ రాష్ట్రపతి అయ్యారు. మన రాజ్యాంగంలో రాష్ట్రపతులు క్రియాశీలంగా ఉండడానికి, తమ విచక్షణలను ఉపయోగించే అవకాశం పెద్దగా రాదు. అలాగే బలమైన ప్రభుత్వాలు ఉన్న సందర్భాలలో వారు చేయగలిగేది ఏమీ ఉండదు. ఆదివాసీలు తమ మనుగడకే ముప్పు వచ్చిందంటూ ఆందోళను చేస్తున్నారు. పోడు భూముల కోసం పోరాడుతున్నారు. ఈ సమయంలో కూడా ఈ దేశ వనరులను కాపాడడానికి ప్రయత్నిస్తున్నారు. గొంతెత్తినందుకు నిర్బంధంలో పడుతున్నారు. ఈ క్రమంలో అన్ని వర్గాలకు న్యాయం చేయగలగాలి. అన్ని వర్గాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం బలపడగలదు. అందుకుముర్ము ఎంపికే ఓ మంచి నిదర్శనం. ఆమె అత్యున్నత పీఠంపై నిలిచినిందుకుమనమంతా గర్వించాలి. మనదేశ ప్రజాస్వామ్యం సమున్నతమైనదని





## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్.

# నాలుగు బొమ్మల కథ

కుటుంబరావు, అనసూయ దంపతులకు ప్రియ లేక లేక కలిగిన సంతానం. వివాహం అయిన పది సంవత్సరాల తర్వాత పుట్టినందున, ఆ అమ్మాయిని వారు ఎంతో ప్రేమగా పెంచుకోసాగారు. తాను ఆడిందే ఆట, పాడిందే పాటగా పెరిగింది. బజార్లో ఏ వస్తువునైనా చూసి కావాలని పేచీ పెడితే క్షణాలలో ఆ వస్తువు ఆమె ఒడిలో వుండాల్సిందే ! ఇంటిలో పని చేసే నౌకర్లందరూ కూడా ప్రియ అంతే ఎంతో అభిమానంగా వుండే వారు.

అష్టైశ్వర్యాలలో పుట్టి పెరుగుతున్నా ఆ అమ్మాయిలో గర్వం అనేది కించిత్ కూదా కనిపించేది కాదు. అందరితో ప్రేమగా, స్నేహంగా మెలుగుతుండేది. స్నేహితులు తన వస్తువులను అడిగితే కాదనకుండా ఇచ్చేసేది. ఆమే స్నేహానికి కులం, మతం, పేదా గొప్పా అన్న పట్టింపులు అసలు లేవు. అందరితో కల్మషం లేకుండా మెలుగుతూ,స్నేహం చేస్తూ ప్రియ మంచి అమ్మాయి అన్న పేరు తెచ్చుకుంది.

ప్రియలో అన్నీ మంచి గుణాలే వున్నా ఈ ఒక్క లక్షణమే కుటుంబరావు దంపతులకు నచ్చేది కాదు. ప్రేమించడానికి, స్నేహాలకు,త్యాగానికి ఒక హద్దు అంటూ వుండాలన్నదే వారి ధృఢ విశ్వాసం. ప్రియ హద్దులనేవి లేకుండా ఎలాంటి వారితోనైనా ఎంత సేపైనా భేజషాలు లేక మట్లాడడం, అడిగిన వారికి లేదనకుండా, ఆసలు ఆలోచించకుండా ఇచ్చెయ్యడం భవిష్యత్తులో ఎటువంటి దుష్పరిణామాలకు దారి తీస్తుందో నని వారు అనుక్షణం భయపడుతుండేవారు.

వయసుతో పాటు ప్రియలోని స్నేహ, దాన గుణాలు కూడా పెరుగుతూ వచ్చాయి. అయితే ఇది కొన్ని సార్లు చెడు ఫలితాలను ఇచ్చేది. అమాయకురాలైన ప్రియకు మంచికి, చెడుకూ మధ్య తేడా ను గుర్తించగలిగేది కాదు. షాప్ కీపర్లు ఆమె అమాయకత్వాన్ని గుర్తించి చిల్లర కూడా ఎగ గొట్టేసినా ఆమె ఏమీ అనేది కాదు. అంతకంటే అనలేకపోయేది అనడమే సమంజసంగా వుంటుంది.

ఒకరోజు ప్రియా వాళ్ళ అమ్మ, ప్రియను అదే ఊరిలో వుండే తమ దూరపు బంధువులకు కొన్ని బట్టలు, స్వీట్స్ ఇచ్చి రమ్మని పంపగా అరగంట లోనే ప్రియ ఉత్తి చేతులతో తిరిగొచ్చింది. ఏమయ్యిందని అడుగగా వీధి మొదట్లో ఒక బిచ్చగత్తె ఎదురుపడి కట్టుకోవడానికి బట్టలు లేవని అడగగా ప్రియ మొత్తం బట్టలను, స్వీట్స్ లను ఆమెకు ఇచ్చేసి వచ్చానని, ఎంతో అమాయకం గా చెప్పింది. ఆ మాటలతో అనసూయకు పట్టరాని కోపం రాగా ఆవేశంతో ఊగిపోతూ ప్రియ రెండు చెంపలను ఎడా పెడా వాయించేసింది. ఎప్పటికి బాగుపడతావే ఆని, ఇష్టం వచ్చినట్లు తిట్టి ప్రియను గదిలోకి తోసేసి తలుపులేసేసింది.

జరిగే తతంగాన్ని చూస్తున్న ప్రియ నాయనమ్మ వచ్చి, అనసూయను వారించి, ఆ పిల్లది చాలా అమాయకమైన స్వభావం, దానిని మనం మంచి మాటలతో మార్చాలి గాని, ఇలా ఆవేశపడితే లాభం లేదని అనునయించి చెప్పింది. ప్రియలో మార్పు తప్పక తేవాలని అప్పటి కప్పుడే ప్రియ నాయనమ్మ నిర్ణయించేసుకుంది.



ఆ రోజు రాత్రి ప్రియ నాయనమ్మ ప్రియ దగ్గరకు వచ్చి మూడు బొమ్మలను ఇచ్చి ఒక దారాన్ని ఒకొక్క బొమ్మ చెవి గుండా ఎక్కించమని చెప్పింది. నాయనమ్మ చెప్పినట్లే ప్రియ చెసింది. ఆశ్చర్యం కలిగే విధంగా మొదటి బొమ్మ చెవుల గుండా దారం సాఫీగా సాగి పోయింది. " ప్రపంచంలో కొంతమంది ఏ మాటలనైనా ఒక చెవితో విని మరొక చెవితో వదిలేస్తారు. మాటలను ఏ మాత్రం మనస్సుకు పట్టించుకోరు. అలాంటి మనష్యులకు ఈ మొదటి బొమ్మ తార్కాణం. ఇప్పుడు రెండో బొమ్మ చెవుల గుండా దారం పోనివ్వు" అంది నాయనమ్మ.

రెండొ బొమ్మ చెవి నుండి దారం దూర్చగా అది నోట్లో లుంగలు చుట్టుకొని పోయింది. " ఈ తరహా మనుష్యులు ఏం వింటారో దానంతటినీ బయటకు చెప్పెస్తారు. దేనిని మమసులో దాచుకోరు ఇక మూడో బొమ్మను ట్రై చెయ్యి" అంది నాయనమ్మ.

ఆ మాటలకు ప్రియలో కుతూహలం ఎక్కువయ్యింది. మూడో బొమ్మ చెవిలో నుండి వెళ్ళిన దారం బయటకు రాలేదు. " ఇటువంటి మనష్యులు చాలా వింటారు కాని కొంచెమే మాట్లాడుతారు. పై రెండు బొమ్మల లాగే ఈ లక్షణం కూడా మంచిది కాదు" చెప్పింది నాయనమ్మ.

'అయితే ఎటువంటి ప్రవర్తన మంచిదనిపించుకుంటుంది నాయనమ్మా ?"ఆసక్తిగా అడిగింది ప్రియ. ఆమె ముఖ కవళికలు బట్టి ఆమెపై తన మంత్రం పని చెస్తోందని గ్రహించింది నాయనమ్మ.

వెంటనే వెళ్ళి నాలుగో బొమ్మ తెచ్చి ప్రియకు ఇచ్చి " దీనిని ప్రయత్నించు" అని చెప్పింది. ఎడమ చెవి గుండా ప్రియ దారం పోనివ్వగా అది రెండో చెవి నుండి బయటకు వచ్చింది.

"ఇంకొక సారి ప్రయత్నించు" చెప్పింది నాయనమ్మ.

ఈసారి చెవిలో నుండి పంపగా దారం నోట్లోంచి బయటకు వచ్చింది. ముచ్చటగా మూడొసారి ట్రై చెయ్యగా చెవిలోంచి పంపించిన దారం అసలు బయటకు రాలేదు.

పై మూడింటి కంటే ఇదే మంచి బొమ్మ. ఈ బొమ్మకు ఎప్పుడు వినాలో, ఏం వినాలో,ఎప్పుడు మాట్లాడాలో, ఏమి మాట్లాడాలో, ఏది మాట్లాడకూదదో , ఎప్పుడు మౌనంగా వుండాలో తెలుసు. సంధర్భాన్ని బట్టి దీని ప్రవర్తన మారుతుంటుంది. ఇటువంటి ప్రవర్తన కలిగినవారే ఉత్తములు. వారే జీవితంలో బాగా రాణిస్తారు" అని ప్రియను అక్కున చేర్చుకొని ముద్దు పెట్టుకుంది నాయనమ్మ. " నా పిచ్చి తల్లీ. మంచితనం వుండడం తప్పుకాదు కాని అది చేతకానితనంగా మారకూడదు. ఇతరులకు మనకు వున్న దాంట్లో కొంత ఇవ్వడం లో తప్పులేదు కాని అవసరం వున్నవారికే ఇవ్వాలి, లేకపోతే నీ దానం పనికి రాకుండా పోయే ప్రమాదం వుంది. మోసం చెయ్యడం ఎంత తప్పో మోసగింపబడడం కూడా అంతే తప్పు. ఇదే నువ్వు ఈ నాలుగు బొమ్మ ల నుండి నేర్చుకోవలసింది" అని అనునయం గా చెప్పింది నాయనమ్మ.

ఆనాటి నుండి ప్రియ అవసరం వున్నప్పుడే మాట్లాడడం,అపరిచితులను దూరంగా వుంచడం, అవసరం వున్నా వారికే సహాయం చేయడం మొదలు పెట్టింది. అసలే మంచి పిల్ల అయిన ప్రియ తన మారిన ప్రవర్తనతో ఇంకా మంచి పిల్లగా పేరు తెచ్చుకుంది.

సి హెచ్ ప్రతాప్
హైదరాబాద్,91368 27102

# గోరా జీవిత సర్వస్వం హేతు వాదానికే అంకితం

## జూలై 26... నాస్తిక వాది గోపరాజు వర్ధంతి

హేతువాదం అనే తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించే వారిని హేతువాదులు అంటారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏదైనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించడం లేదా ఆరా తీయడాన్ని హేతువాదం అంటారు. జ్ఞానానికి లేదా బుజువుకు "హేతువు" లేదా "కారణం" అనేది మాత్రమే నమ్మదగిన ఆధారం అని భావించే తాత్విక ధోరణిని హేతువాదం అంటారు. హేతువాదానికి శాస్త్రీయ దృక్పథం పునాది. మానవుడే కొలమానం, మనిషి అన్నిటికీ మూలం అనే మూలసూత్రాలతో హేతువాదం ఆవిర్భవించింది.

గోరా'గా ప్రసిద్ధులైన గోపరాజు రామచంద్రరావు నాస్తికుడిగా, హేతువాదిగా, గాంధేయవాదిగా తెలుగు వారందరికీ సుపరిచితులు. ఆయన దృష్టిలో ఆస్తికత, హేతువాదం రెండు భిన్న ధ్రువాలు. నేటి సమాజంలో అగ్ర, నిమ్న జాతులనే వర్ణ బేధాలు, అంధ విశ్వాసాలు పెరగటానికి ఆస్తికతే కారణం అని ఆయన గట్టి నమ్మకం. మానవులందరూ ఒకటే అన్న భావం పెరగాలంటే , అది ఒక్క నాస్తికవాదం వల్లనే సాధ్యమని విశ్వసించి, నాస్తికభావాల ప్రచారం కోసం తన జీవితమంతా వెచ్చించారు గోరా. పెళ్ళికి ముందే సెక్స్ పై అవగాహనలు, కుటుంబ నియంత్రణ, వీటితో పాటు అప్పటి తెలుగు సమాజంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను తెచ్చిపెట్టిన ఘనత గోరాదే.


గోరా ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న ఛత్రపూర్ అనే కుగ్రామంలో, 1902, నవంబరు 15 న ఉన్నతకుల హిందూ కుటుంబంలో వెంకట సుబ్బారావు, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. పర్లాకిమిడిలో ప్రాథమిక విద్యాభాసం పూర్తిచేసిన తర్వాత 1913లో పిఠాపురం రాజా కళాశాల ఉన్నత పాఠశాలలో చదివారు. 1920లో పిఠాపురం రాజా అనుబంధ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన గోరా, అప్పుడే ప్రారంభమౌతున్న సహాయ నిరాకరణోద్యమంలో కాలూనారు. 1922లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో వృక్షశాస్త్రంలో బి.ఏ చేశారు. రామచంద్రరావు వృక్ష శాస్త్రంలో డిగ్రీ చదివి, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అదే శాస్త్రంలో మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణుడయ్యారు. 1922 లో సరస్వతిని ఆమె 10 ఏళ్ళ ప్రాయంలోనే వివాహం చేసుకున్నారు. మధురలోని మిషన్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో ప్రత్తి పరిశోధనా సహాయకుడిగా, తర్వాత కొలంబోలోని ఒక కళాశాలలో జీవశాస్త్ర అధ్యాపకునిగా, 1928లో కాకినాడ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. తాను నడిచే మార్గం తండ్రికి ఇష్టం లేకపోవడంతో 1928 లో భార్య, పిల్లలతో ఇంటిని వదిలేసి వచ్చారు. స్వతంత్ర భావాలుగల గోరా ఎక్కడా ఉద్యోగంలో నిలువలేక పోయారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వపు జైళ్లలో కఠిన శిక్షలు అనుభవించారు. గోరా అనేక రచనలను చేశారు. సంఘం, ఆర్థిక సమత అనే పత్రికలను నడిపారు. వర్ణవ్యవస్థ, అంటరానితనం మీద తన యుద్ధాన్ని ప్రకటించిన గోరా 1940 లోఆయన భార్యతో కలసి నాస్తిక కేంద్రాన్ని, కృష్ణా జిల్లాలోని ఒక గ్రామంలో ప్రారంభించారు. దేశస్వాతంత్ర్యం సందర్భంగా, 1947 లో, కేంద్రాన్ని విజయవాడకు తరలించారు. 1944లో



మహాత్మా గాంధీ కోరిక మేరకు అఖిల భారత కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా అలహాబాద్, ఢిల్లీలలో పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుని గానేకాక, సాంఘిక, ఆర్థిక సమానత్వ సాధనకు, మూఢ నమ్మకాల నిర్మూలనకు, ప్రజల్లో శాస్త్రీయ దృష్టిని పెంపొందించ డానికి, వయోజన విద్యా వ్యాప్తికి, కుల, మత తత్వాల నిర్మూలనకు అనితర కృషి గోరా సల్పారు. గాంధీతో నాస్తికత్వంపై చర్చలు జరిపి, అస్పృశ్యతా నిర్మూలన కోసం కృషి చేసారు. దళితుల దేవాలయ ప్రవేశాన్ని, సమష్టి భోజనాలను, వివాహాలను విస్తృతంగా ఆయన నిర్వహించారు.

ఆయనకు తొమ్మిది మంది సంతానం. సంతానానికి ఆయన సందిర్భోచితంగా పేర్లు పెట్టారు. ఉప్పు సత్యాగ్రహం కాలంలో పుట్టినందున లవణం, భారతీయులు చట్టసభలలో నిలిచి గెలిచిన కాలంలో పుట్టినందున విజయం, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పుట్టినందున ఒక కుమారునికి సమరం, మరొక కుమారునికి నియంత. తొమ్మిదవ సంతానానికి నౌవ్ గా పేర్లు పెట్టారు. హిందీ భాషలో నౌవ్ అంటే తొమ్మిది అని అర్థం. కుమార్తెలు మనోరమ, మైత్రి, విద్య. గోరా 25 ఏళ్ళ వయసు వరకు అస్తికుడే. తరువాత నాస్తిక సిద్ధాంతాలతో జీవితాంతం కృషి సల్పిన గోరా జీవితమే ఒక ఆదర్శం. ఆయన తన భార్యకి గర్భం వచ్చిన ప్రతిసారీ గ్రహణ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమెను బయటకి తీసుకొని వెళ్లి తిప్పేవారు. గ్రహణం సమయంలో గర్భిణులు బయట తిరిగినంత మాత్రాన పుట్టబోయే పిల్లలకు గ్రహణం మొర్రి రాదు, అని నిరూపించటానికి.

గోరా తన సంతానం అందరికీ, వారివారి అభీష్టం మేరకు, వర్ణాంతర వివాహాలు 'నాస్తిక పద్ధతిలో' జరిపించారు. ప్రముఖ కవి, దళిత కులానికి చెందిన గుర్రం జాషువా కూతురైన హేమలతను, తన కుమారుడైన లవణంకు వివాహం జరిపించిన ఆదర్శవాది గోరా. చెప్పింది చేసి చూపించిన మహనీయుడు ఆయన. 1970 లో బోస్టన్ లోనూ,1974లో హాలండ్ లోని అంష్టర్డాంలో జరిగిన అంతర్జాతీయ హ్యూమనిష్టు మహాసభలలో గోరా పాల్గొన్నారు. తెలుగులో ఒక వార పత్రిక 'సంఘం' ను స్థాపించి, దాని ద్వారా తన ఆశయాలను, లక్ష్యాలను ప్రజలలో విశేషంగా ప్రచారం చేశారు. గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది, నాస్తిక ఉద్యమ నాయకుడు, హేతువాది అయిన గోరా, 26 -07 -1975 న విజయవాడ లోని నాస్తిక కేంద్రంలో ప్రసంగిస్తూ మరణించారు. గోరా శతజయంతి సందర్భంగా 2002 లో భారత ప్రభుత్వం, తపాలా బిళ్ళను విడుదల చేసింది. నాస్తికత్వం (దేవుడు లేడు), దేవుని పుట్టు పూర్వోత్తరాలు, జీవితం నేర్పిన పాఠాలు, నేను నాస్తికుడిని, సృష్టి రహస్యం, సంఘ దృష్టి, ఆర్థిక సమానత్వం, నాస్తికత్వం - ప్రశ్నోత్తరాలు, నాస్తికత్వం - ఆవశ్యకత తదితర రచనలు చేశారు. ఆయన కోడలైన శ్రీమతి హేమలతా లవణం తన తండ్రి జాషువా రచనలను వెలుగులోకి తెస్తూ, మామగారైన గోరా స్థాపించిన 'నాస్తిక కేంద్రాన్ని' కూడా సమర్ధవంతంగా నడిపారు. ఆమె కూడా 19 -03 -2008 న నాస్తికకేంద్రం, విజయవాడలోనే మరణించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# పోలవరంపై ఇంకెంతకాలం సమర్ధించుకుంటారు

## సిఎం జగన్ తీరుపై మండిపడ్డ చంద్రబాబు

అమరావతి,జూలై25 : పోలవరం నిర్మాణం విషయంలో ప్రభుత్వ తప్పును కేంద్రం, పీపీఏ, నిపుణుల కమిటీ తేల్చి చెప్పాయని తెదేపా అధినేత చంద్రబాబు దుయ్యబట్టారు. సీఎం జగన్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. గుత్తేదారును మార్చవద్దని పీపీఏ, జలవనరులశాఖ చెప్పినా వైకాపా ప్రభుత్వం వినిపించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం నిర్మాణం ఆలస్యం కావటంపై కేంద్ర ప్రభుత్వ వ్యవస్థల నుంచి నిపుణుల కమిటీల వరకూ అన్నీ వైకాపా ప్రభుత్వాన్నే తప్పుబడుతు న్నందున ఇప్పుడేం సమాధానం చెబుతారని తెదేపా అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి జగన్‌ను నిలదీశారు.

పార్టీ ముఖ్య నేతలతో వ్యూహ కమిటీ సమావేశం నిర్వహించిన చంద్రబాబు.. పోలవరం పరిహారంపై నాటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పోలవరం గుత్తేదారును మార్చవద్దని పీపీఏ, కేంద్ర జలనరుల శాఖ రాసిన లేఖలను, చేసిన హెచ్చరికలను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. గోదావరి వరద బాధితులను ఆదుకోవటంలోనూ ప్రభుత్వం నూరు శాతం విఫలమయ్యిందని చంద్రబాబు దుయ్యబట్టారు. 2014 నుంచి ఎలాంటి ఇబ్బందులు లేని విలీన గ్రామాలు.. ఇప్పుడు ఈ ప్రభుత్వ వైఖరితో మళ్లీ తెలంగాణలో కలపాలనే డిమాండ్ చేస్తున్నాయన్నారు. 'పేదలకు ఇచ్చింది జగనన్న కాలనీలు కాదు.. జలగన్న కాలనీలు' అని ఎద్దేవా చేశారు. విలీనం పేరుతో రాష్ట్రంలో బడులు మూసేస్తున్న ప్రభుత్వం.. బార్లు మాత్రం తెరుస్తోందని దుయ్యబట్టారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ విషయంలోనూ విద్యాశాఖ దారుణంగా విఫలం అయ్యిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని మొత్తం 1.42 కోట్ల లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుల విషయంలో ప్రభుత్వం సమాధానం పెద్ద బూటకమన్న చంద్రబాబు.., విశ్వసనీయత ఉంటే శ్వేతపత్రం విడుదల చేయ్యాలన్నారు. అదాన్ డిస్టలరీకి రెండేళ్లలోనే రూ.2,400 కోట్ల విలువైన ఆర్డర్లు ఏ విధంగా ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై ఈడీ విచారణ జరపాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

# సిఎం ముందు ఎలా మాట్లాడాలో తెలుసుకోండి

## లంక గ్రామాల ప్రజలకు మంత్రి వార్నింగ్

అమలాపురం,జూలై25( : కోనసీమ జిల్లా పి. గన్నవరం మండలం జి. పెద్దపూడి పరిసర లంక గ్రామాల్లో ఈ నెల 26న సీఎం జగన్ పర్యటించనున్నారు. ముందస్తుగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తో పాటు ప్రజా ప్రతినిధుల బృందం లంక గ్రామాల్లో పర్యటించింది. ఇంటింటికి వెళ్లారు. సీఎం వస్తున్నందున ఆయన ముందు ఏ విధంగా మాట్లాడాలనే అంశంపై మంత్రి వరద బాధితులకు శిక్షణ ఇచ్చారు. 26న సీఎం జగన్ మీ ముందుకు వస్తున్నారు. మీరు పడ్డ కష్టాలను మీ నోటి నుంచే స్వయంగా వినాలని మీరు పొందిన భరోసా, ధైర్యాన్ని మీ నుంచి తెలుసుకోవడానికి వస్తున్నారని మంత్రి తెలిపారు. మహిళలకు శిక్షణ ఇచ్చాక సీఎం ముందు ఎలా మాట్లాడాలో వారితో చెప్పించారు. మధ్యలో ఓ మహిళ మాట్లాడేందుకు ప్రయత్నించడంతో మంత్రి జోక్యం చేసుకుని నువ్వు ఆగమ్మా అంటూ శిక్షణ ఇచ్చిన మహిళ చేత మళ్లీ చెప్పించుకున్నారు. ఇదే తరహాలో సీఎం జగన్ ముందు డ్వాక్రా మహిళలు, వాలంటీర్లు , సచివాలయ ఉద్యోగులు ఎలా మాట్లాడాలో.. ఆ నాలుగు లంక గ్రామాల్లో శిక్షణ ఇస్తున్నారు.

# ఇంటింటికీ బూస్టర్ డోసు

మొదటిపేజీ తరువాయి..

పెరుగుతున్నాయన్న మంత్రి... వాటి కట్టడికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఐదేండ్ల క్రితం వర్షాలు తగ్గిన తర్వాత డెంగ్యూ వ్యాధి విజృంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మలేరియా వ్యాధి ప్రబలుతుందని తెలిపారు. మలేరియా, డెంగ్యూ కేసులు పెరగకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని, అన్ని జిల్లాల్లో కిట్స్ అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. ప్రతి ఆదివారం హెల్త్ టీమ్ చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని చెప్పారు. నిల్వ ఉన్న నీటి ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుందన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా ఈ సీజనల్ వ్యాధులు చాలా వరకు తగ్గాయన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సురక్షిత మంచినీటి సరఫరాతో చాలా వరకు అంటూ వ్యాధులు, సీజనల్ వ్యాధులు కూడా చాలా తగ్గాయని స్పష్టం చేశారు. ప్రజలందరూ తమ తమ ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వనికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్స్‌లో మధ్యాహ్న భోజనం క్వాలిటీ ఉండేలా చూసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. బూస్టర్ డోస్ వేసుకోవాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ప్రభుత్వనికి సహకరించాలని కోరుతున్నామన్నారు. ప్రజాప్రతిధులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. మంకీపాక్స్ వ్యాధి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కువైట్ నుంచి కామారెడ్డికి వచ్చిన ఇబ్రహీంకు మంకీపాక్స్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం ఇబ్రహీం ఫీవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని, అతని నమూనాలను సేకరించి, పుణెలోని ఎన్ఐవీ ల్యాబ్‌కు పంపామని తెలిపారు. ఫీవర్ ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.డెంగ్యూ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్న ఆయన... ప్రతి జిల్లాలో ప్లేట్ లెట్ ల కోసం హాస్పిటల్ ను కేటాయించామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ కిట్లు అందుబాటులో ఉంచామని, స్కూళ్లు, కాలేజీలు, ఇతర ప్రైవేట్ సంస్థల్లో ప్రతి శుక్రవారం 'డ్రై డే ' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా ఇక నుంచి క్రమం తప్పకుండా ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. అలాగే ప్రతి ఆదివారం మున్సిపల్, పంచాయతీ అధికారులు ఇంటింటికి వెళ్లి ఇన్స్?పెక్షన్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా రోజురోజుకూ కరోనా కేసులు పెరుగుతున్నయన్ని మంత్రి... రాష్ట్రంలో కూడా కరోనా కేసులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కరోనా విషయంలో అలసత్వం వద్దని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. మాస్కులు, సానిటైజర్లు కచ్చితంగా వాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బూస్టర్ డోస్ వేయించుకోవాలని చెప్పారు. కామారెడ్డికి చెందిన వ్యక్తి కి మంకీ పాక్స్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పిన మంత్రి... టెస్టింగ్ కోసం శాంపిల్ ను పూణెకు పంపినట్లు తెలిపారు. ఇతర దేశాల్లో మంకీ పాక్స్ విజృంభిస్తోందన్న మంత్రి... విదేశాల నుంచి వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా మంకీ పాక్స్ లక్షణాలు ఉంటే దగ్గర్లోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని కోరారు. మంకీ పాక్స్ కు సంబంధించి శాంపిల్ పరిశీలన కోసం గాంధీ హాస్పిటల్, ఫీవర్ హాస్పిటల్ కు వెళ్లాలని మంత్రి కోరారు.


# తెలుగు భాషా పరిరక్షణ అందరి - బాద్యత
## ఇంగ్లీష్ మోజులో మాతృ భాషను మరవద్దు

అమెరికా తెలుగు సంగం. వేలమంది అతిదులు ఈ సమావేశానికి రావడానికి కారణం తెలుగు పదము. తెలుగు పదము, మన బాషకు, మన సంస్కృతికి, మన చరిత్రకు చిన్నహము. బాష నశించిన సమాజము చరిత్రహీనమైంది.

యునెస్కో వారు 30 సంవత్సరాలలో తెలుగు బాష చచ్చిపోతదని తెలిపారు. మద్య, దిగువ మద్య తరగతి తెలుగు పిల్లలు తెలుగు నేర్చుకోవడము లేదు అనిచెప్పారు. ఇప్పటి పరిస్తితులను బట్టి చూస్తె అది వాస్తవమే అనిపిస్తుంది. దీనికి కారణం రెండు తెలుగు రాష్ట్రాలలో కేజీ నుండి ఇంగ్లీషు మాద్యమం మొదలు పెట్టారు. ఇది ఎంతవరకు సమంజసము?

రాజకీయ నాయకులు ప్రజలు ఇంగ్లీషు మాద్యమం కోరుతున్నారని చెపుతున్నారు. ప్రజలు ఇంగ్లీషు మీద ప్రేమ ఉండి ఇంగ్లీషు మాద్యమం కోరడం లేదు. ఇంగ్లీషులో చదువుకుంటె తమ పిల్లల ఉద్యోగాలు మెరుగు పడుతావని అని ఆశిస్తుతున్నారు.

ఇది బాషా సమస్యలా కనిపించిన, నిజంగా ఇది పెద్ద నిరుద్యోగ




సమస్య.

హిందీ రాష్ట్రాల వారికి కేంద్ర ప్రబుత్వ ఉద్యోగాలు సులబముగా దొరుకుతవి. హిందీ కాని రాష్ట్రాల యువతకు ఇది ఒక గడ్డు సమస్యగా మారింది. ఫ్రాన్సు, జపాన్, రష్యా, చైనా లాంటి దేశాలలో వారి మాతృబాష నేర్చుకున్న తరువాత ఇంగ్లీషు ను రెండవ బాషగా నేర్చుకుంటున్నారు. తెలుగు యువత కూడ తెలుగు నేర్చుకున్న తరువాత ఇంగ్లీషు ను రెండవ బాషగా నేర్చుకుంటె, ఎవరికి అబ్యంతరము లేదు.

తెలుగు రాష్ట్రాలలో ప్రతి సంవత్సరం 11 లక్షల విద్యార్దులు 10 వ తరగతి లో చదువుతున్నారు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల నుండి పాశ్చాత్య దేశాలకు ప్రతి సంవత్సరము బతుకుదెరువు కై వలస పోయేవారు 10,000 మాత్రమే. ఇంగ్లీషు మాద్యమం పెట్టిన తరువాత అది 12,000 కు చేరవచ్చు.

మిగతా 11 లక్షల యువత బవిష్యతు ఏమి?

కుల, మత నాయకులు తమ స్వలాబానికై ఈ సమస్యను ముందుకు తెస్తున్నారు. సమాజములో నిస్పృహ ఉన్నంత కాలము కులనాయకులను ఎదురించే శక్తి ఎవరికి లేదు. గతంలో సమైక్య ఆంద్ర ప్రదేశ్ రాష్ట్రంలో 715 ఇంజనీరింగ్ కాలేజిలు తెరిచారు, 3.5 లక్షల విద్యార్దులను ప్రతి సంవత్సరము చేర్చుకున్నారు. వీరిలో 90 శాతం విద్యార్దులు ఉద్యోగము దొరకక, రోడ్లపై తిరుగుతున్నారు.

తెలుగు రాష్ట్రాలు యుద్దప్రాదికపై తయారిరంగం(ఉత్పాదక రంగం) ఉపాది రంగం(స్వయం ఉపాధి) లో ఉద్యోగాలు కలిపించాలి. అది జరగక ఇంగ్లీషు మాద్యమం పెట్టినంత మాత్రాన ఉద్యోగాలు పెరుగవు. వారి పరిస్తితి కూడ ఇప్పుడున్న ఇంజనీరింగ్ విద్యార్దులగా నిరుద్యోగులు కాక తప్పదు. అప్పుడు మన యువత రెంటికి చెడ్డ రేవడిలా, అటు మాత్ర బాష రాదు, ఇటు ఉద్యోగం దొరకదు.

మన యువత తెలుగుబాష నేర్చుకున్న తరువాత ఇంగ్లీషును రెండవ బాషగా నేర్చుకోవచ్చు. ఇంటర్నెటు లో ఇంగ్లీషు సులబంగా నేర్చుకోవడానికి చాలా వసతులు,టూల్స్ఉన్నవి. కంచ ఐలయ్య, ఆర్. కృష్ణయ్య, ఆకునూరి మురళి లాంటి కుల నాయకులు ఈ విషయము గ్రహించాలి. వారు మన యువతను, వారి తల్లితండ్రులను తప్పుతోవన తీసుకపోవడము ఆపివేయాలి. ప్రజాసామ్యములో పౌరుడు తన బాద్యతలను సక్రమంగా నెరవేర్చాలంటె చదువు అవసరము. అది మాతృబాష ద్వారనే లబించగలదు. ఈ నాడు మన తెలుగు బాష క్లిష్ట పరిస్తితిలో ఉంది.

కులనాయకులు నిరుద్యోగాన్ని ఆసర తీసుకొని ఇంగ్లీషు మాద్యమం లో చదివితె మీ పిల్లలకు అమెరికాలో ఉద్యోగాలు ఎదురు చూస్తున్నవని భ్రమ పెడుతున్నారు. అమెరికాలో ఉన్న నల్ల అమెరికన్లకు మనకన్న మంచి ఇంగ్లీషు రాస్తారు, మాట్లాడుతారు, కాని వారికి ఐటిలో ఉద్యోగాలు లబించడము లేదు. ఐటి లో ఉద్యోగము దొరకడానికి బాష ఒక్కటే కారణం కాదు. పాశ్చాత్య దేశాలు ఏరోజైన ఈ ఉద్యోగాలను ఆపివేయవచ్చు.

60 లక్షల జనాబ ఉన్న ఇజ్రాయిల్, స్వీడన్ దేశాలు యునివర్సిటి వరకు మాతృబాషలోనే బోదన చేస్తారు. తెలుగు రాష్ట్రాల జనాబ 8 కోట్లు! మనమెందుకు అది చేయడము లేదు.

రాజకీయ నాయకులు ఎలక్షన్ లో గెలవడానికి ప్రజలు కోరుతున్నారని సాకు చూపిస్తున్నారు. చాలా మంది మీలాంటి విద్యావంతులు గతములో తెలుగు మాద్యమంలో చదివి అమెరికాకు డాక్టర్లుగా, ఇంజనీయర్లగా, సైంటిస్టులు గా వచ్చారు. ఇప్పుడు మనమంత ఏకమై కులనాయకులకు, రాజకీయనాయకులకు, తల్లితండ్రులకు తమ పిల్లలు మాతృబాషలో చదవాలి, వారి లేత వయసులో ఇంగ్లీషు మాద్యమం అవసరము లేదని గట్టిగా చెప్పాలి.

అలా చెపితె సరిపోతదా అంటె, లేదు అనిచెప్పాలి. వారికి బరోస ఇవ్వాలంటె తెలుగుకూటమి వారు ప్రతిపాదించిన ఈ 13 ప్రతిపాదనలు తెలుగు రాష్ట్రాల ప్రబుత్వాలు అమలు చేయాలి.

తెలుగు భాషా పరిరక్షణకై తెలుగు కూటమి వారు చేసిన ప్రతిపాదనలు

1.తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ యంత్రాంగము లావాదేవిలు అన్నీ తెలుగులో జరగాలి .

2 తెలుగు రాష్ట్రాలలో కోర్టు వాదనలు , తీర్పులు , డాకుమెంటేషన్ తెలుగు లో జరగాలి .

3 తెలుగు రాష్ట్రాలలో పోలీసు క్రైం రిపోర్టులు తెలుగులో జరగాలి .

4 తెలుగు రాష్ట్రాలలో గుడులలో , మసీదులలో , చర్చిలలో ప్రార్ధనలు తెలుగులోజరపాలి .

5 తెలుగు రాష్ట్రాలలో పేరు పలకలు, గుర్తు పలకలు తెలుగులో ఉండాలి .

6 తెలుగు రాష్ట్రాలలో డాక్టర్లు రాసె మందు చిట్టీలు , మందుల వివరాలు తెలుగులో ఉండాలి .

7 తెలుగు రాష్ట్రాల్లో మూడవ భాష బోధనను తగ్గించి , పిల్లలపై భారాన్ని తొలగించాలి.

7 తెలుగు లిపిని సులభం చేసి సరళమైన తెలుగు భాషను వాడుకలోకి తేవాలి .

ఈ లాంటి ప్రతిపాదనలు చాలా రాష్ట్రాలలో అమలులో ఉన్నవి. తెలుగు బాష, తెలుగు సంస్కృతి, తెలుగు చరిత్రను రక్షించడానికి మీరు కంకణం కట్టుకుంటారా? లేక మెక్సికో, సెంట్రల్ అమెరికా దేశాలవలె, వారి మాతృబాష, వారి చరిత్ర పోగొట్టుకొని, స్పానిష్ మాట్లాడినట్టు మన జాతిని మంట గలుపుదామా? ఆలోచించండి!

(గమనిక: 17 వ ఆటా సమావేశం లో తెలుగుబాష పరిరక్షణపై రాసిన ప్రసంగ వ్యాసం.

ఈ వ్యాసం తేటతెలుగు లిపిలో రాయబడ్డది. మహాప్రానాల స్తానంలో అల్పప్రానాలు వత్తులతో సహ రాయబడ్డది).



-మదు కె. రెడ్డి, ఫ్లోరిడా.



## సిక్కుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తాం: మంత్రి కొప్పుల ఈశ్వర్

### మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన సిక్కు ప్రముఖులు

హైదరాబాద్ జూలై 25 (ప్రజా మంటలు) : సిక్కుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలిస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ హామీనిచ్చారు.మాజీ ఐపీఎస్ ఆఫీసర్ తేజ్ దీప్ కౌర్ మీనన్ నాయకత్వంలో పలువురు సిక్కు ప్రముఖులు సచివాలయంలో సోమవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె తెలంగాణలోని సిక్కులలో చాలా మంది పేదరికంలో ఉన్నారని,ఇతర మైనారిటీలతో పాటు తమకు కూడా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరారు.రాష్ట్రంలో 44 గురుద్వారాలు ఉండగా,వీటికి ఆదాయ వనరులు లేక నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు.వీటి పూజారీలు (గ్రంథి ),రాగీస్ ( కీర్తన్ సింగర్స్) జీవనోపాధి భారంగా ఉన్నందున, వీరికి ప్రతి నెల 7,500 రూపాయల గౌరవ వేతనం ఇవ్వాల్సిందిగా కోరారు. ప్రముఖులు చెప్పిన వాటిని మంత్రి కొప్పుల సావధానంగా విని, సానుకూల దృక్పథంతో పరిశీలిస్తానని హామీనిచ్చారు.

## రాజకీయాలను వీడాలనిపిస్తోంది

### కేంద్రి మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు

నాగపూర్,జూలై25: రాజకీయాలను వదిలేయాలన్న ఆలోచనలు అప్పుడప్పుడు వస్తుంటాయని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్



గడ్కరీ అన్నారు. రాజకీయాల కన్నా జీవితంలో చూడాల్సింది ఎంతో ఉందని ఆయన అన్నారు. నాగపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు స్వస్తి పలకాలని ఎన్నో సార్లు అనుకున్నానని, కానీ అలా జరగడం లేదన్నారు. సామాజిక కార్యకర్త గిరీశ్ గాంధీ సన్మాన కార్యక్రమంలో గడ్కరీ ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రాజకీయాలంటే సామాజిక మార్పు అని, కానీ ఇప్పుడు అందరూ అధికారం కోసం రాజకీయాలను ఆశ్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ రోజుల్లో రాజకీయాల్లో ప్రతి ఒక్కరూ అధికారం కోసం నూరు శాతం ప్రయత్నిస్తున్నారని, కానీ రాజకీయాలంటే సామాజిక ఆర్థిక సంస్కరణ అని, అందుకే నేటి రాజకీయవేత్తలు విద్య, కళలు సంస్కరణ కోసం పనిచేయాలని ఆయన అన్నారు. రాజకీయం అనే పదాన్ని అర్థం చేసుకోవాలని, అది సమాజ, దేశ సంక్షేమం అని తెలిపారు.

## రాష్ట్రపతి భవన్ వీడిన కోవింద్ దంపతులు

### జన్‌పథ్ రోడ్డులోని ప్రత్యేక నివాసానికి చేరిక

న్యూఢిల్లీ,జూలై25: మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు రాష్ట్రపతి భవన్‌ను వీడారు. ఢిల్లీ జన్‌పథ్ రోడ్డులోని తన కొత్త నివాసానికి కోవింద్ తన కుటుంబ సమేతంగా వెళ్లారు. మాజీ రాష్ట్రపతు లకు ప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పిస్తుంది. వారికి ఉచిత నివాసంతో పాటు, అలవెన్సులు ఇస్తారు. ఈ క్రమంలో కోవింద్‌కు, అంతకు ముందు ప్రణబ్ ముఖర్జీకి కూడా ప్రత్యే నివాలసాలను అందుబాటులోకి తెచ్చారు.ఇదిలావుంటే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌పై జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్ నాథ్ కోవింద్ దేశ రాజ్యాంగాన్ని పణంగా పెట్టి బీజేపీ రాజకీయ అజెండాను అమలు చేశారంటూ ఆరోపించారు. రామ్ నాథ్ హయాంలో దేశ రాజ్యాంగం పలుసార్లు ఉల్లంఘనకు గురైందన్నారు. ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ బిల్లును ప్రస్తావిస్తూ రామ్ నాథ్ కోవింద్ పై విమర్శలు చేశారు. మైనార్టీలు, దళితులపై దాడుల అంశాలను మెహబూబా ముఫ్తీ తన ట్వీట్‌లో ప్రస్తావించారు. భారతదేశ 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ.. కొత్త రాష్ట్రపతి ముర్ము చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పలు రాష్ట్రాల గవర్నర్లు, పలువురు కేంద్ర మంత్రులతో పాటు ముఖ్యమంత్రులు కూడా పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు.

## సమరయోధుల కలలు సాకారం చేయాలి

**సబ్‌కా ప్రయాస్-సబ్‌కా కర్తవ్య్ నినాదంతో ముందుకు**
**ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

న్యూఢిల్లీ,జూలై25: స్వాతంత్య సమరయోధుల కలలు సాకారం చేయాల్సి ఉందని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. 'సబ్‌కా ప్రయాస్-సబ్‌కా కర్తవ్య్' నినాదంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. అమృత్ మహోత్సవ్ వేళ మరింత వేగవంతంగా పనిచేయాలని చెప్పారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో భారత 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్య మాట్లాడుతూ.. అవినీతి నియంత్రణతో దేశం పురోభివృద్ధివైపు పయనిస్తున్నదని చెప్పారు. భారత జవాన్ల శౌర్యానికి నిదర్శనంగా రేపు విజయ్ దివస్ వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. జవాన్లు, దేశ ప్రజలందరికీ విజయ్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. అభివద్ధి నిరంతరం జరగాల్సిన పక్రియ అని చెప్పారు. స్థిరమైన జీవన విధానం చాలా అవసరమని వెల్లడించారు. అటవీ సంపద, నీటి వనరుల ప్రాధాన్యం గుర్తించాలని, ప్రకృతి సంపదను అందరూ కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు.

## నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

### పంటముంపు గ్రామాన్ని పరిశీలించిన వేముల

నిజామాబాద్,జూలై25: రైతులు ఎవరు అధైర్య పడొద్దు అండగా ఉంటామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఏర్గట్ల మండలం దోంచంద గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట ముంపునకు గురైన ప్రాంతాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధిక వరదల నేపథ్యంలో పంట పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోవడాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. బాధిత రైతులకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. మంత్రి ఆదేశాల మేరకు ఇటీవల జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సెంట్రల్ కమిటీ అధికారులు వర్ష ప్రభావిత ప్రాంతాలని పరిశీలించిన సంగతి తెలిసిందే.

## గెలిచిన 12మంది టీఆర్ఎస్‌లో చేరితే కాంగ్రెస్ ఏం చేసింది

మొదటిపేజీ తరువాయి..

మనుషులు సోషల్ మీడియాలో పని చేశారని ఆరోపించారు. తాను కాంగ్రెస్ కు దూరమవుతాననే ఆవేదనతో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్కమార్క వచ్చి తనతో మాట్లాడరని చెప్పారు. అందరం కలిసి పని చేయాలని కోరడానికి భట్టి వచ్చారన్నారు. తనకు సీఎల్పీ కావాలని గతంలో అధిష్టానాన్ని అడిగానని, అయినా తనకు ఇవ్వకుండా మల్లు భట్టి విక్రమార్కకు ఇచ్చారని, ఈ విషయంలో మొదటి నుంచి భట్టికి పూర్తి సహకారం అందించానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. తన నియోజకవర్గం ప్రజల అభిప్రాయ సేకరణ ప్రకారం త్వరలో నిర్ణయం తీసుకుంటానని క్లారిటీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో మునుగోడు నియోజకవర్గ ప్రజలతో సమావేశమవుతానని చెప్పారు. ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు కల్యాణ లక్ష్మీ చెక్కులు అందించే దుస్థితి నెలకొందన్నారు. మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. మంత్రి జగదీశ్ రెడ్డి మునుగోడుకు 10సార్లు వచ్చినా..తాను ఒక్కసారి వెళ్లినా ఒకటే అన్నారు. టీఆర్ఎస్ నుంచి ఈటెల రాజేందర్ బయటకు వచ్చి బీజేపీలో చేరి, ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. అమిత్ షా, మోడీ ద్వయంతో కేంద్ర ప్రభుత్వం బలంగా ఉంటుందని హుజురాబాద్ లో ఈటెల రాజేందర్ గెలిచారని చెప్పారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిది కాంగ్రెస్ కుటుంబమని, సోనియాగాంధీ,రాహుల్ గాంధీపై వారికి చాలా గౌరవం ఉందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. సీఎం కేసీఆర్ పై సీరియస్‌గా కొట్లాడుదామని తనతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ తోనే రాష్ట్ర ప్రయోజనాలు సాధ్యమవుతాయని చెప్పారు. వివిధ అభివృద్ధి పనుల దృష్ట్యా ఎమ్మెల్యేలు మంత్రులను కలుస్తారని, దాంట్లో ఎలాంటి తప్పు లేదన్నారు. పదవులను చాలా మంది నాయకులు కోరుకుంటారని, కానీ అవి కొందరికే వస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రజల లక్ష్యాల కోసం అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితో చెప్పానన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ కాంగ్రెస్ ఎమ్మెల్యే కాబట్టే తనతో మాట్లాడడానికి వచ్చానని, పార్టీ మార్పు విషయంలో కన్విన్స్ అవుతారని భావిస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్టానం ఆరా తీస్తోంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ రంగంలోకి దిగారు. నిన్న తన నివాసంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డి మాట్లాడిన అంశాలను అధిష్టానం క్లిప్పింగ్స్ తీసుకుంది. రాజగోపాల్ రెడ్డి గతంలో కూడా పార్టీ విషయంలో చేసిన కామెంట్స్, ఇచ్చిన వివరణలను ఠాగూర్ తెప్పించుకున్నారు. గతంలో ఆర్సీ కుంతియా, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, పార్టీ విషయంలో అలాగే నాగార్జున సాగర్ ఉప ఎన్నికల సందర్భంగా చేసిన కామెంట్స్‌ను కూడా ఠాగూర్ పరిశీలిస్తున్నారు. తాజాగా సోనియా గాంధీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని.. పార్టీ మారడం చారిత్రాత్మక అవసరం అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన కామెంట్స్ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.



## జిఎస్టీ, ధరలపై సభలో కాంగ్రెస్ ఆందోళన

### ప్లకార్డులతో నిరసలను వ్యక్తం చేసిన సభ్యులు


### వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టు

### సభాకార్యక్రమాలకు అంతరాయం కలుగుతోందన్న స్పీకర్

న్యూఢిల్లీ,జూలై25: లోక్‌సభ నుంచి నలుగురు కాంగ్రెస్ ఎంపీలను బహిష్కరిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నారు. సభలో అనుచితంగా ప్రవర్తిస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారనే కారణంగా కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మాణికమ్ ఠాకూర్, టీఎన్ ప్రతాపన్, జోతిమణి, రమ్య హరిదాస్‌ను ఈ లోక్‌సభ సమావేశాలు ముగిసే వరకూ సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. విపక్షం కోరుకున్న అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్ష సభ్యులు నిరసన తెలిపారని స్పీకర్ ఓం బిర్లా చెప్పుకొచ్చారు. ఉభయ సభల్లో విపక్ష సభ్యులు నిరసనకు దిగడంతో సమావేశాలు వాయిదా పడిన పరిస్థితి నెలకొంది. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణంపై చర్చకు సోమవారం నాటి పార్లమెంట్ సమావేశాల్లో విపక్షాలు పట్టుబట్టాయి. సస్పెండ్ అయిన కాంగ్రెస్ ఎంపీల్లో ఒకరైన లోక్‌సభ ఎంపీ మాణికమ్ ఠాకూర్ మాట్లాడుతూ.. జీఎస్టీ, ధరల పెరుగుదల వంటి ప్రజా సమస్యలపై కేంద్రం దృష్టి సారించే విధంగా విపక్షాలు ప్రయత్నం చేస్తుంటే.. ప్రభుత్వం మాత్రం విపక్షాలతో అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిరోజు పార్లమెంట్ నిబంధనలకు అనుగుణంగానే తాము నడుచుకుంటున్నామని.. తాము వాయిదా తీర్మానాలను ఇస్తున్నామని చెప్పారు. ఇవాళ కూడా వాయిదా తీర్మానాన్ని ఇచ్చామని.. అయితే ప్రభుత్వం మాత్రం అదేమీ పట్టించుకోకుండా విపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపు, మైదా, మజ్జిగ, పెరుగు వంటి వస్తువులపై జీఎస్టీ విధించడంపై కాంగ్రెస్ ఎంపీలు లోక్ సభలో ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ అంశాలపై చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ వాయిదా తీర్మానం ఇచ్చారు. ధరల పెరుగుదలపై లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీలు ప్లకార్డులతో నిరసనలు చేపట్టారు. అయితే.. నిరసన తెలియ జేయాలనుకుంటే సభ బయట ప్లకార్డులు ప్రదర్శించాలని, సభలో ప్రదర్శించకూడదని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత చర్చకు సిద్ధంగా ఉన్నామని, తమ ఓపికను బలహీనతగా భావించవద్దంటూ హెచ్చరించారు. అంతకుముందు సభ వాయిదా పడిన తర్వాత మరోసారి సభలోకి ప్లకార్డులతో వచ్చి నిరసన తెలియజేశారు. దీంతో సభకు పదేపదే ఆటంకం కలుగుతుండడంతో పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి విపక్ష ఎంపీల తీరును ఖండించారు. సభలోకి ప్లకార్డులు తీసుకొచ్చిన కాంగ్రెస్ కు చెందిన నలుగురు ఎంపీలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. దీంతో నలుగురిని స్పీకర్ సస్పెండ్ చేశారు. ఆగస్టు 12వ తేదీన వర్షాకాల సమావేశాలు ముగియనున్నాయి. అప్పటి వరకూ నలుగురు ఎంపీలపై వేటు పడినట్లే. సస్పెన్షన్ కు గురైన అనంతరం నలుగురు ఎంపీలు పార్లమెంటు మైదానంలోని మహాత్మాగాంధీ విగ్రహం దగ్గరకు వెళ్లి నినాదాలు చేశారు. కేంద్రంపై నిప్పులు చెరిగారు. తమ ఎంపీల్లో కొందరిని సస్పెండ్ చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని కాంగ్రెస్ మండిపడింది. ప్రజలకు సంబంధించిన అంశాలను పార్లమెంటులో ప్రశ్నిస్తుంటే కేంద్రం తమ సభ్యుల గొంతు నొక్కేస్తోందని ఆరోపించింది.

## జగిత్యాల జిల్లాలో కొత్తగా భీమారం, ఎండపల్లి మండలాలు

జగిత్యాల జూలై 23(ప్రజా మంటలు) : రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఉన్న ప్రజల డిమాండ్ మేరకు కొత్తగా కొన్ని మండలాలల్ను ఏర్పరిచింది. అందులో భాగంగా, జిల్లాలో రెండు మండలాలను కొత్తగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు




జారీచేసింది. మేడిపల్లి మండలంలోని భీమారం, వెల్గటూర్ మండలం లోని ఎండపల్లిని కొత్త మండలాలుగా ప్రకటించింది. దీంతో జిల్లాలలో మండలాల సంఖ్య 20కి పెరిగింది.

వేములవాడ నియోజావర్గంలోని మేడిపల్లి మండలాన్ని విభజించి, 9 గ్రామల్తో భీమారం మండలం ఏర్పడగా, ధర్మపురి నియోజకవర్గంలోని వెల్గటూర్ మండలం నుండి 12 గ్రామాలు, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని 3గ్రామాలను కలిపి విడదీసి, ఎండపల్లి మండలం ఏర్పరచారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు షురూ....

### మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి సమక్షంలో చేరిన యువకులు

**భీమదేవరపల్లి జూలై 25 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి సమక్షంలో యువత చేరికల పర్వం ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి స్వగ్రామం అయిన ములకనూరులో



సైదాపూర్ మండలానికి చెందిన పలువురు యువకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్, నాగరాజు, సురేష్, అనిల్, శ్రీధర్, రమేష్ లు ప్రవీణ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ%శా%. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినట్లు తెలిపారు. ప్రవీణ్ అన్న యువసేనలో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేయడానికి ముందుకు వచ్చినట్లు వారు తెలిపారు.

## జాతీయ పురస్కారాలు అందుకున్న దంపతులు

**భీమదేవరపల్లి జూలై 25 (ప్రజామంటలు):** స్నేహ కళానికేతన్ సొసైటీ వరంగల్






ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాల అవార్డు - 2022 లు ప్రకటించారు. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సెరికల్చర్ ఆఫీసర్ రషీద్, ఏఎన్ఎమ్ శుకుర లు ఈ అవార్డ్ అందుకున్నారు. గాన కోకిల (సింగర్) అవార్డ్ ను రషీద్ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మరియు 27 వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ చేతుల మీదుగా అందుకున్నారు. అదే విధంగా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డ్ గ్రహీత శుకురా తెరాస లీడర్ గెస్ట్ ఆఫ్ హానర్ రచయిత, దర్శకులు అశోక్ వరంగల్ మరియు నాట్య బ్రహ్మ పోలేపాక భుజంగరావు ఫౌండర్ ప్రెసిడెంట్ చేతుల మీదుగా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 28 వ డివిజన్ కార్పొరేటర్ గందే కల్పనా నవీన్, చింతాకుల సునీల్, అంబేద్కర్ నేషనల్ ఫెల్లో షిప్ అవార్డు గ్రహీత పి ప్రభాకర్, ట్రాఫిక్ ఎస్సై రామారావు, చారీ, యమ్ సుజన తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి కోలాట బృంద కళాకారులచే ప్రదర్శన

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ



సౌజన్యంతో శ్రీ పద్మావతి కోలాట బృందం సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో కళాకారులచే జనగామ చౌరస్తా నుండి నెహ్రూ పార్కు వరకు ప్రదర్శన కొనసాగింది. జనగామ జిల్లా మున్సిపల్ చైర్మన్ పోకల జమున డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కు పూలమాల ర్యాలీ ప్రారంభించారు. తదనంతరం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి శ్రీ కృష్ణమాచారి ఆధ్వర్యంలో కళాకారుల ఆట పాట, డప్పు నృత్యాలు, యక్షగాన నాటకాలు, కోలాట కళాబృందాలు నాలుగైదు సీన్లు చక్కగా ప్రదర్శించి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించారు. కృష్ణమాచారి కళాకారులను ప్రోత్సహిస్తూ కలల్ని ఆదరిస్తూ తెలంగాణా రాష్ట్ర సాంస్కృతిక శాఖ, శ్రీపద్మావతి కళాబృందం అధ్యక్షురాలు పిల్లుట్ల స్రవంతిని ప్రత్యేకంగా అభినందించారు.



**15వ రాష్ట్రపతిగా తొలి గిరిజన మహిళ ద్రౌపది ముర్ము బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ హన్మకొండలో బిజెపి శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించగా పాల్గొన్న రావు పద్మ, మార్తినేని ధర్మారావు, ఏనుగు రాకేశ్ రెడ్డి తదితరులు**

# కుమ్మరి సంఘ నూతన కమిటీ ఎన్నిక

**తరిగొప్పుల జూలై 25 (ప్రజామంటలు):** మండలంలోని కుమ్మర్ల సంఘ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన మండల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మర ఆత్మగౌరవ ట్రస్టు డైరెక్టర్ ఏనుగు తల యాదగిరి మరియు జిల్లా అధ్యక్షుడు రాయవరం వెంకట్ నారాయణ హాజరై మాట్లాడుతూ..... కుమ్మర్లు ఆర్థికంగా సామాజికంగా విద్యా ఉద్యోగ రాజకీయంగా రంగాలలో ఉండాలంటే కుమ్మరోళ్ళందరూ ఐక్యంగా ఉండాలని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని రాజకీయ పార్టీలు మారిన కుమ్మర్లను గుర్తించిన దాఖలు లేవని అన్నారు. ఈరోజు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కుమ్మర్ల గౌరవం కాపాడను ఉద్దేశంతో ఉప్పల్లో మూడెకరాల భూమి మూడు కోట్ల రూపాయలతోనే కుమ్మర్ల కేటాయించడంపై రాష్ట్ర కుమ్మర్లు హర్షం వ్యక్తం చేస్తూ కుమ్మర్లకు సంక్షేమ పథకాలు అందాలంటే కుమ్మర్ల ఐక్యత చాటాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రాయరపు వెంకటనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని కుమ్మర్ల స్థితిగతులపై జిల్లా కమిటీ పక్షాన త్వరలో సర్వే చేపడతామని అన్నారు, సమావేశం అనంతరం తరిగొప్పుల మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడిగా ఎదునూరు భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎదునూరు కనక రత్నం, ఉపాధ్యక్షుడు ఎదునూరి చంద్రం, ప్రధాన కార్యదర్శిగా ఎదునూరి సిద్దయ్య, అధికార ప్రతినిధిగా రమేష్, కార్యవర్గ సభ్యులు ఎదునూరు కృష్ణయ్య, గిద్దలూరు కనకయ్య,



వంగపల్లి కనకయ్య, రాష్ట్ర కార్యదర్శి ఉపేందర్, జిల్లా నాయకులు రవికుమార్, జిల్లా అధికార ప్రతినిధి రాయపూర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి' నానుడికి తార్కాణం

### అరబిందో పూర్వ విద్యార్థులు

**జనగామ జూన్ 25 (ప్రజామంటలు):** వృత్తి లో, సమాజం లో ఎంత ఎదిగినా కూడా ఒదిగి ఉండాలి అనే నానుడికి తార్కాణం అరబిందో స్కూల్ విద్యార్థులు అని ఆ పాటశాల ప్రిన్సిపాల్ ఇనుగాల ప్రభాకరరెడ్డి అన్నారు. 1996-97 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం జనగామలోని ఒక వేడుకల మందిరంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాతిక సంవత్సరాల క్రితం పాఠశాలను వదిలి వెళ్ళిన విద్యార్థులు ఇలాంటి వేడుకలు నిర్వహించి గురువులను సత్కరించడం కొనియాడదగిన విషయమన్నారు. విదేశాలలో ఉన్న విద్యార్థులు కూడా వచ్చి పాల్గొనడం వల్ల వారు అక్కడ మన దేశ సంస్కృతికి ప్రతీకగా జీవిస్తున్నట్లుగా భావించ వచ్చునన్నారు. జన్మభూమి ని, చదువు నేర్పిన బడిని, ఓనమాలు నేర్పిన గురువులను సత్కరించడం ప్రశంసనీయం అని అన్నారు. తమ స్నేహ సౌభ్రాతృత్వాన్ని గుర్తుచేసుకుంటూ రజతోత్సవ వేడుకలు జరుపుకోవడం అభినందనీయం అని ఇందుకు బాధ్యులైన విద్యార్థుల పని తీరును ప్రశంసించారు. ఆటపాటలతో సంతోషంగా ఆనందంగా గడపడం కాకుండా మన సంస్కృతిని ప్రతిబింబించేలా తమకు విద్యాబోధన చేసిన గురువులకి పాద పూజ చేసి నిర్వహించిన



గురుపూజోత్సవం మనోహర దృశ్యంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండే కాకుండా దుబాయ్ నుండి కూడా ఇద్దరు విద్యార్థులు పాల్గొనడం విశేషం. తమకెంతో నూతనోత్సాహం, ఆహ్లాదకరంగా జరిగిన ఈ సమ్మేళనంలో ఆటపాటలు ఫ్యాషన్ షో తో ఆనందంగా గడిపిన ఈ కార్యక్రమంలో భారద్వాజ్, ప్రదీప్, సుమన్, కొడిపాక బాలరాజు, రామకృష్ణ, నవీన్, సంతోష్, స్వప్న, శిల్ప, రాధిక తదితరులు ప్రధాన భూమిక పోషించారు.

# సీజనల్ వ్యాధులపై మున్సిపల్ కమిషనర్ సమీక్ష

**జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు):** మున్సిపల్ కమిషనర్ స్వరూప రాణి వార్డు ఆఫీసర్లు మరియు అధికారులతో సీజనల్ వ్యాధుల పట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా కమిషనర్ మాట్లాడుతూ.... వార్డు అధికారులు అందరూ ప్రతిరోజూ వార్డులను పర్యవేక్షిస్తూ రోజు వారి చేస్తున్న పనులతో పాటు పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నీటి నిలువలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, కాళీ స్థలమును ప్లాట్ యజమానులతో శుభ్రం చేయించాలని, కూలిపోయే ఇండ్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని, మురికి కాలువలు అన్ని శుభ్రం చేయించాలని, నీటి నిలువల యందు ఆయిల్ బాల్స్ వేయించాలని మరియు అంటి లార్వా స్ప్రే చేయించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా వార్డు అధికారులు అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. జగిత్యాల పట్టణ ప్రజలు వర్షాకాలములో నీటి నిల్వలు ఉన్నచోట మలేరియా మరియు డెంగ్యు దోమలు అభివృద్ధి చెందే అవకాశము ఉన్నందున పట్టణములో మీకు సంబందించిన ఖాళి స్థలములలో పిచ్చి మొక్కలు, నీటి నిల్వలు లేకుండా చూడగలరు. ఒకవేళ ఉన్నయెడల వాటిని మీరే తొలగించుకొనగలరు మరియు శిథిలావస్థలో ఉన్న ప్రహారి గోడలు / గృహములు ఉన్నట్లయితే అట్టి వాటిని మీరే స్వతహాగా తొలగించుకొనగలరు లేని యెడల తెలంగాణ మున్సిపాలిటి ఆక్టు-2019 ప్రకారము పురపాలక సంఘము



ద్వారా అట్టి వాటిని తొలగించి మీ వద్ద నుండి యూసర్ చార్జెస్ వసూలు చేయబడునని కమిషనర్ తెలిపారు.

# అవినీతికి కేరాఫ్ అడ్రస్ 'జనగామ మున్సిపల్ టిపివో' వెంటనే సస్పెండ్ చేయాలి

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** అక్రమాల పుట్ట అవినీతికి కేరాఫ్ అడ్రస్ మారిన జనగామ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తులతో కంప్లైంట్ మాఫియా టీం ఏర్పాటు చేసుకుని జనగామ పట్టణంలో ఇల్లు కట్టుకుంటున్న పేద మధ్యతరగతి ప్రజలను బెదిరిస్తూ టీబీపాసులో అప్లై చేసుకొని అనుమతులు పొంది అనేక కుంటి సాకులు చూపుతూ లక్షల రూపాయలు డిమాండ్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, అధికార పార్టీ నాయకులు చెబితే ఒక తీరుగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ప్రజలు ఏవరైన దృష్టికి సమస్యలు తీసుకపోతే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నాంచుడు దొరణితో వ్యవహరిస్తూ అక్రమాలకు వసూళ్ల దందాకు పాల్పడుతున్నారని, శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని



మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి, మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి ఒక ప్రకటనలో తెలిపారు.

# హమాలి కార్మికుల సంక్షేమం కోసం హమాలి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

**రఘునాథ్ పల్లి జూలై 25 (ప్రజామంటలు):** హమాలి కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం హమాలి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 3వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు తెలిపారు. మండలంలోని నిడిగొండ మహాలక్ష్మి సివిల్ సప్లై గోదాం హమాలి కార్మికుల సమావేశం దొర గొల్ల యాదగిరి అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు మాట్లాడారు. హమాలి కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రమాద బీమా పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన హమాలి కార్మికులకు నెలకు 5 వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా హమాలి కార్మికులు అసంఘటిత రంగ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను అలాగే ఆగస్టు 3వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పొదల నాగరాజు, జి.



మహేందర్ మహాలక్ష్మి, గోదాం హమాలీ యూనియన్ నాయకులు మాధురి యాదగిరి, చేవెళ్ల శ్రీశైలం, కాట రాజు, ఉపేందర్, కాటా బుచ్చయ్య, పెండ్యాల శ్రీను, దోరగొల్ల నర్సింహులు, దోరగొల్ల సత్తయ్య, పెండ్యాల ఉపేందర్, ఆరూరి ఐలయ్య, శంకరయ్య, గూండా శ్రీను, నర్సిరెడ్డి, భాస్కర్, బాలయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# కట్టమైసమ్మ బోనాల జాతరలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**సికింద్రాబాద్ జులై 25 (ప్రజామంటలు):** బేగంపేటలోని కట్టమైసమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించిన అమ్మవారి బోనాల జాతర వేడుకలకు ముఖ్య అతిథిగా



కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు కేంద్ర మంత్రిని అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను ఇచ్చి, అమ్మవారి ఆశీర్వాచనాలు చెప్పారు. ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన బేగంపేట భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తర్కంపేట శ్రవన్ కుమార్ ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. స్థానిక నాయకులు మిథున్, సంధ్య, లక్ష్మీ, పవన్ పాఠక్, మహేశ్, ప్రమోద్ నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బోనాల ఉత్సవాల వేడుకల్లో వేలాది మంది పాల్గొని, అమ్మవారికి బోనాలు సమర్పించి, తమ మొక్కులను తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# సిటీ లో స్కై 209వ అన్నదానం

**సికింద్రాబాద్ జులై 25 (ప్రజామంటలు):** సిటీలోని పలు ప్రధాన రహదారుల ఫుట్



పాత్ లపై ఆశ్రయం లేకుండా దుర్భర పరిస్థితుల్లో ఆకలితో అలమటిస్తున్న అనాథలకు స్కై ఫౌండేషన్ అండగా నిలుస్తోంది. ఆదివారం తమ 209 వ అన్నదాన కార్యక్రమంలో భాగంగా తమ కార్యాలయ ఆవరణలో వంట చేసి ప్యాక్ చేసిన ఆహార ప్యాకెట్లను వారు తమ వాహనంలో రోడ్లన్నీ తిరిగి అభాగ్యులకు అందచేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ డా.వై.సంజీవ్ కుమార్, ఓ.పావని లు మీడియాతో మాట్లాడుతూ.... ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రోడ్లపై జీవచ్ఛంలా పడి ఉన్న వందలాది మందికి ఆశ్రయం కల్పించి, వారికి ఏదో ఒక పని కల్పించి, కొత్త జీవితాన్ని ప్రసాదించాలని కోరారు. వారికి ఓటు హక్కు లేదనే భావన వీడి, మానవత్వ దృక్పదంతో స్పందించాలని కోరారు. అలాగే వారికి ఆధార్ కార్డులు, ఓటు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కీర్తి, కుషికోమల్, ఆంజనేయులు, విఖ్యాత్, అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లకు ఈపాస్ మిషన్ల పంపిణీ

**హుస్నాబాద్ జూలై 25( ప్రజామంటలు):** హుస్నాబాద్ మండల గోదాం లో అఖిల తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సమైక్య సంఘం హుస్నాబాద్ మండల అధ్యక్షుడు



ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా రేషన్ డీలర్లకు ఈపాస్ మరియు కొత్త వే మిషన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున వెంకన్న ద్వారా డీలర్లకు వే మిషన్లు హుస్నాబాద్ మండల వ్యవసాయ మార్కెట్ గోదాంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజన్ టెక్ జిల్లా కోఆర్డినేటర్ అనిల్, మండల కో ఆర్డినేటర్ వెంకట్, గోదాం ఇంచార్జి చంద్రయ్య, రిజ్వాన్, అఖిల తెలంగాణ రేషన్ డీలర్ల సమైక్య సంఘం రాష్ట్ర కోశాధికారి తాడూరి లక్ష్మణ్ జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ మాటూరి గోపి, హుస్నాబాద్ మండల అధ్యక్షులు గంగారపు చేతన్, కార్యదర్శి సయ్యద్ సలీం మరియు అక్కన్నపేట్ మండల అధ్యక్షుడు పాక రమేష్, కార్యదర్శి తంగళ్ళపల్లి రవి, హుస్నాబాద్ అక్కన పేట మండలా లోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# ఘనంగా నాగులూరి నర్సింహా 45వ వర్ధంతి

**సికింద్రాబాద్ జులై 25 (ప్రజామంటలు):** దళిత జనబాంధవుడు, సంఘసేవకుడు దివంగత నాగులూరి మేడ్చల్ నర్సింహా 45వ వర్ధంతి వేడుకలు నాగులూరి



నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్యక్షుడు నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నర్సింహా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోషియేషన్ అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ... తన తండ్రి నర్సింహా ఆశలు, ఆశయాల సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దళితసంఘ నాయకులు నర్సింహా విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు నర్సింహారావు, గిరిధర్ బాబు, శర్మ, మార్పల్లి రవి, తుమ్మ శ్రీను, గౌడ్ శ్రీను, అనీల్, ఆంజనేయులు, రవిశంకర్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ప్రమోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా జగిత్యాల బిజెపి తరుపున శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా అధ్యక్షులు పైడిపెల్లి సత్యనారాయణ రావు ఆద్వర్యంలో ఓల్డ్ బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ. పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, భూమి రమణ, దశరథ్ రెడ్డి ముంజ శ్రీను మండల అధ్యక్షులు నలువాల తిరుపతి, అన్నవేని వేణు, శ్రావణ్ రెడ్డి, పెద్దగంగరాం, ఠాకూర్ పవన్ సింగ్ చిలుకమర్రి మదన్ మోహన్ తదితరులు

## వీఆర్ఏల జేఏసి నిరవధిక సమ్మె

**భీమదేవరపల్లి జూలై 25 (ప్రజామంటలు):** మండలంలో సోమ వారం నుండి రాష్ట్ర వీఆర్ఏల జేఏసి పిలుపు మేరకు, మండల తహాశీల్దారు కార్యాలయలం




ముందు నిరవధిక సమ్మె చేపట్టినట్లు మండల అధ్యక్షులు సారయ్య, ప్రధాన కార్యదర్శి జెట్టి రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ా%. నిరవధిక సమ్మె చేపట్టడానికి గల డిమాండ్స్ ను తెలియజేశారు. సీఎం అసెంబ్లీలో ప్రకటించిన స్కేల్ జీ.ఓ. వెంటనే విడుదల చేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్స్ కల్పించాలన్నారు. 55 సంవత్సరాలు పైబడిన మరియు మరణించిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. 2017 ఫిబ్రవరి 24 మహాశివరాత్రి పర్వదినాన వీఆర్ఏలకు ప్రగతి భవన్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చి జీఓ వచ్చే వరకు సమ్మె కొనసాగు తుందన్నారు. సమ్మెలో సంధ్య, రమాదేవి, పద్మ, కిరణ్, చంటి, సతీష్, వెంకటేశ్వర్లు, ప్రణయ్, నిజాం, పులమ్మ, పోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సి వర్గీకరణపై బీజేపీ నిర్లక్ష్య వైఖరి వీడాలి

### పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

**జగిత్యాల జులై 25 (ప్రజామంటలు):** ఎస్సి వర్గీకరణపై కేంద్రంలోని బిజెపి పార్టీ



అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వీడాలని సత్వరమే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ దూమాల గంగారాం డిమాండ్ చేశారు. నాలుగవ రోజు ఆర్డీవో ఆఫీస్ ఎదుట చేపట్టిన వర్గికరణ సాధన దీక్ష మండల అద్యక్షులు మీసాల సాయిలు పాల్గొనగా గంగారాం మాట్లాడారు. గత 28 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సి ఏబిసిడి వర్గీకరణపై ఉద్యమం కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ ఎం.ఈ.ఫ్. జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల లక్ష్మణ్, ఎం.ఎస్.ఫ్. జిల్లా నాయకులు, సనవాల ప్రసాద్, ఎం.ఎస్.పి. చేర్యాల డివిజన్ కో-ఆర్డినేటర్, పిన్నింటి శ్రీహరి, ఎమ్. ఎస్.ఎఫ్ నాయకులు చుంచు రమేష్ ఎంఎస్పీ నాయకులు దర్శనం వెంకన్న నాయకులు ఇదం ఎల్లయ్య, లింగంపల్లి రాకేష్, సామ్రాట్ ప్రకాష్, వేల్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టిక బెల్లం పట్టుకొన్న ఆబ్కారీ సీ.ఐ., తరిగొప్పుల ఎస్.ఐ.

**తరిగొప్పుల జులై 25 (ప్రజామంటలు):** నాటుసార ను ఉక్కు పాదంతో అణచివేయాలని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన చేసిన విషయం



విదితమే. అయినప్పటికీ అధికారుల కళ్లుగప్పి గుట్టుచప్పుడు కాకుండా నాటుసార కు కవలిసిన పట్టిక బెల్లం తరలిస్తున్న సమయంలో స్టేషనుఘనపుర్ ఆబ్కారీ శాఖ సి.ఐ. నరేష్, తరిగొప్పుల మండలం ఎస్.ఐ. డి. నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ టూ బొత్తలపర్రె వెళ్లు రహదారి లో వాహనాలు తనిఖీ చేస్తూండగా ఎర్రకుంట తండా కు చెందిన గుగులోతు నీల, కిష్టయ్య టాటా ఇండికా కార్ నెం (ఏపీ 09 బిజే 5806) లో రెండు క్విటాంళ్ల బెల్లం, 10 కేజీల పటిక తో పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసినట్లుగా సి.ఐ. నరేష్ తెలిపారు. ఈ తనిఖీ లో హెడ్ కానిస్టేబుల్ బి. విఠల్ రావు, కానిస్టేబుల్ ఎస్.డి. గాలిబ్, అబ్కారి కానిస్టేబుల్ రవీందర్ మరియు యాకుబ్ పాషా పాల్గొన్నారు.

## ఫోటో షాప్ టూల్ డిజైనింగ్ లో ఉచిత శిక్షణ

**హన్మకొండ జులై 25 (ప్రజామంటలు):** ఫోటో షాప్ టూల్ డిజైనింగ్ లో ఉచిత శిక్షణను ఉత్సాహవంతులైన యువతకు రెడిన్ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు సంస్థ యజమాని గాదె లింగమూర్తి తెలిపారు. ఆసక్తి గల యువతి, యువకులు ఈ నెల 23 నుంచి ఆగస్టు 5 వ తేదీ లోపు పూర్తి బయోడేటాతో సి.సి. రెడ్డి కాంప్లెక్స్ లో గల తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# రియల్ వ్యాపారంలో దూసుకుపోతున్న ప్రభుత్వ ఉద్యోగులు

- ప్రభుత్వ ఉద్యోగులా...? రియల్టర్లా...?
- ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపమే ఇందుకు కారణమా..?
- దొరసాని బావి సైతం కబ్జా....
- పడకేసిన అధికార యంత్రాంగం

**హుస్నాబాద్ జూలై 25 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం రియల్ వ్యాపారంలో దూసుకుపోతుంది. ఈ



రియల్ వ్యాపారాన్ని నడిపిస్తుంది ఏ బడా బాబులో కాదండోయి అలా అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే, ప్రభుత్వ రంగాన్ని నడిపించే ప్రభుత్వ ఉద్యోగులే రియల్ రంగంలో రాజ్యమేలుతున్నారు. ఇందులో ప్రతి ఒక్క శాఖ నుండి ప్రభుత్వ ఉద్యోగులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ప్రభుత్వ సీలింగ్ భూములను సైతం వదలకుండా వెంచర్లు వేస్తూ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరింప చేస్తున్నారు. వీటికి కనీసం మున్సిపల్ శాఖ వారి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఎక్కడైనా భూమిని కొనుగోలు చేయాలంటే గజం చొప్పున లెక్క కడతారు కానీ హుస్నాబాద్ పట్టణంలో ఫీట్ చొప్పున ధర నిర్ణయించి రియల్ వ్యాపారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. హైదరాబాదు లాంటి మహా నగరంలోని లేని ధరలు హుస్నాబాద్ పట్టణంలో ఉన్నాయంటే అతిశయోక్తి లేదు.

**చెరువులు, కుంటలు కబ్జా......**

హుస్నాబాద్ పట్టణంలో లోతట్టు ప్రాంతాలుగా ఉన్న చెరువులు మరియు కుంటలను సైతం వదలకుండా కబ్జా చేస్తూ లేఔట్లుగా మార్చి వినియోగదారులకు అంటగడుతున్నారు. తీరా లోతట్టు ప్రాంతంలోని ప్లాట్ ను కొనుగోలు చేసిన వినియోగదారుడు నీరు నిల్వ ఉండడం చేత లబోదిబోమంటున్నాడు. ఇటీవల హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్లే రోడ్డులో కొన్ని శతాబ్దాల నాటి దొరసాని బావిని సైతం కబ్జా చేసి వెంచర్లుగా మార్చి విక్రయిస్తుండడం గమనార్హం.

**రియల్ వ్యాపారంలో దళారులదే పై చేయి....**

సంతలో వ్యాపారం లాగానే రియల్ వ్యాపారంలో కూడా దళారులే



మధ్యవర్తిత్వం వహించి అటు కొనే వారి నుండి ఇటు అమ్మేవారి నుండి కమిషన్ల రూపంలో దండుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం దళారులుగా వ్యవహరిస్తున్నారంటే హుస్నాబాద్ పట్టణంలో ఏ స్థాయిలో రియల్ వ్యాపారం జరుగుతుందో మనం ఊహించుకోవచ్చును. ఇదిలా ఉంటే సామాన్య మానవుడు ఒక గుంట స్థలం కొనాలంటే శక్తికి మించిన భారంగా భావిస్తున్నాడే తప్ప సొంత కలలను నెరవేర్చుకునే దుస్థితి లేకుండా పోయింది. రియల్ వ్యాపారం పై అధికారుల అండదండలు హుస్నాబాద్ పట్టణంలో రియల్ వ్యాపారం తారాస్థాయికి చేరిన సంబంధిత అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం కనిపించడం లేదు. అధికారుల అండదండల తోనే రియల్ వ్యాపారం జరుగుతుందని పట్టణ ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇది ఇలానే కొనసాగినట్లయితే హుస్నాబాద్ పట్టణంలో సెంటు భూమిని కూడా వదలకుండా కబ్జా చేసి దండుకుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రావస్థ మాని రియల్ వ్యాపారం చేస్తున్న వారిపై ఓ కన్ను వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు

# ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చిత్రపటం ఏర్పాటు

**కరీంనగర్ జూలై 25( ప్రజామంటలు):** రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డిఎ అభ్యర్థిగా బరిలో నిలిచి అఖండ విజయం సాధించి రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బిజెపి శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, కరీంనగర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఫోటోతో ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్లో రాష్ట్రపతి ఫోటో అప్పగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం వాసుదేవ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర ,జాన పట్ల స్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి, జెల్ల సుధాకర్ , మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, జిల్లా ఎన్నికల సెల్ కన్వీనర్ బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, వరాల జ్యోతి, ఎస్టి మోర్చా కట్ట రాజు, కార్పొరేటర్లు కచ్చు రవి, కాసర్ల ఆనంద్, అనూప్, జోన్ అధ్యక్షులు నాగసముద్రం ప్రవీణ్,ఆవుదుర్తి శ్రీనివాస్, నరహరి లక్ష్మారెడ్డి, పాదం శివరాజ్, కొత్తపల్లి మండల అధ్యక్షులు కడార్ల రతన్,రాగి సత్యనారాయణ, సంజీవ్ కుమార్, గుంజేటి శివకుమార్, పరశురాం జి, సత్తయ్య, రమేష్, మాసం గణేష్, పురం హరి, కన్నంబ, గుండ



అరుణ, సుధా వైష్ణవి, ఉమా మహేష్, పోరెడ్డి శ్రీధర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 3, 4 వార్డులలో సిసి రోడ్లు వెయ్యాలని

# వరి నాట్లు వేసి నిరసన తెలిపిన సిపిఎం

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలోని మూడు, నాలుగవ వార్డు లో వరద ముప్పు ప్రాంతంలో సోమవారం సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మూడో వార్డు నాలుగో వార్డులో ఎల్లమ్మ గుడి టెంపుల్ దగ్గర సీసీ రోడ్లు వేయాలని వరి నాట్లు వేసి నిరసన తెలపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ వర్షాలు కురిసి విరామం ఇచ్చి నేటి దినానికి మూడు రోజులు కావస్తున్న ఇంత వరకు బాలాజీ నగర్, జ్యోతి నగర్ ఎల్లమ్మ గుడి ఏరియా, జిఎంఆర్ కాలనీ ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయని అన్నారు. కాలనీ ప్రజల పట్ల వారి ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ ఉందో ఆలోచించాలని అన్నారు. అవసరమున్న ప్రతిచోట సిసి రోడ్లు, మోరీలు నిర్మించాలని ఇండ్ల మధ్య ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీళ్లను తొలగించుటకు మోటార్లను పెట్టి నీటిని తోడివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలందరిని ఐక్యం చేసి మున్సిపల్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు బాల్నే



వెంకట మల్లయ్య, బూడిది జ్యోతి, మారేడు విష్ణు, ఎండి మున్నీర్, బిట్ల శోభ, గుండు అరుణ, శ్రీనివాసులు, లక్ష్మి, గిరిజ, సునీత పాల్గొన్నారు.

# ఇమ్మడి అంజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**హన్మకొండ జులై 25 (ప్రజామంటలు):** గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాలపురం కాంతయ్య నగర్ కు చెందిన ఇమ్మడి అంజయ్య కుటుంబం నివసించే గుడిసె భారీ వర్షాల కారణంగా కూలిపోయింది. ఆ కుటుంబం ప్రస్తుతం ప్లాస్టిక్ కవర్లు, రేకులతో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం గడుపుతుంది. సోమవారం నేను సైతం ఫౌండేషన్ చైర్మన్ రావుల వెంకట్ రమేష్ గౌడ్, ప్రోగ్రాం కన్వీనర్ సాగంటి మంజుల అంజయ్య ఇంటిని సందర్శించి దంపతులను పరామర్శించారు. అంజయ్య పక్షవాతంతో బాధపడుతుండగా అతని భార్య ఇండ్లలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. రమేష్ మాట్లాడుతూ వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేయాలనీ అయన డిమాండ్ చేశారు. మంజుల మాట్లాడుతూ గత వారం నుండి పడుతున్న వర్షాల కారణంగా ఇండ్లలోకి వరద నీరు చేరి,చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయి.



ప్రభుత్వం ఇలాంటి వారికి కనీస అవసరాలు తీరే విదంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువులు స్థానికులు పాల్గొన్నారు.

## కాజీపేటలో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

**హన్మకొండ జులై 25 (ప్రజామంటలు):** రాష్ట్రకమిటీ సమావేశాలు కాజీపేటలో నేటి నుంచి 3 రోజులు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నారు. కాజీపేట ఫాతిమానగర్లోని బాలవికాస సంస్థ కార్యాలయంలో ఉదయం 11:00 గంటలకు సమావేశాలు ప్రారంభించేందుకు జిల్లా నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు మీడియా ఇన్చార్జి రమేష్ తెలిపారు. దీనిలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు, విజయ్ రాఘవన్ పలువురు పాల్గొనున్నారు.

## వర్షాలతో ఇల్లు కూలిపోయిన వ్యక్తికి సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** జనగామ జిల్లా బచన్నపేట



మండలం కట్కూర్ గ్రామానికి చెందిన మూర్రోజు బ్రహ్మచారి ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయి నిరాశ్రయులు కావడంతో సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ చైర్మన్ యాసారపు కర్ణకార్ స్పందించి పెంబర్తి చెందిన కొండబోయిన రాజు ద్వారా బ్రహ్మచారిచే 5 వేల రూపాయిలు ఆర్థిక సహాయం చేయించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ యాసారపు కర్ణాకర్ కొండబోయిన రాజు ధన్యవాదాలు తెలిపారు.



రాయికల్ పట్టణానికి చెందిన 'రుద్ర రచన' చిన్న నాడే తల్లి దండ్రులను కోల్పోయినా కెటిఆర్ సాయంతో కష్టపడి చదివి క్యాంపస్ ఇంటర్వ్యూలో 5 మల్టీ నేషనల్ కంపనీలలో ఉద్యోగం సాధించింది. జగిత్యాల జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ను జెడ్పీ క్వార్టర్స్ లో మర్యాద పూర్వకంగా కలవగా రచనను శాలువాతో సత్కరించి, అభినందించారు.

### ఓపెన్ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్ 2022 లో

## మెట్ పల్లి విద్యార్థుల ప్రతిభ

**మెట్ పల్లి జూలై 26 (ప్రజామంటలు):** ఆదివారం విశాఖపట్నంలోని విశాఖ ఇండోర్ స్టేడియం లో జరిగినటువంటి ఓపెన్ ఇంటర్ స్టేట్



ఛాంపియన్ షిప్ 12 రాష్ట్రాల నుండి రెండు వేల మంది వరకు పాల్గొన్నారు. ఇందులో మెట్ పల్లి జపాన్ కరాటే శిటో ఫెడరేషన్ నుండి ఏడుగురు విద్యార్థులు, కటాస్ స్పారింగ్ విభాగంలో జోగు శివాని, స్నేహిత్, మహిమాన్విత, విహన్దీప్, లినిష, వికాస్ లు బంగారుపతకం సాధించారు కౌశిక్, శ్రయాన్, కార్తిక్ లు వెండి పథకం గెలుపొందారని జపాన్ కరాటే శిటో ఫెడరేషన్ జగిత్యాల డిస్ట్రిక్ట్ చీఫ్ ఇన్స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు. వీరిని తెలంగాణ చీఫ్ సెన్సాయి ఎమ్మెస్ పాషా మరియు గ్రామస్తులు అభినందించారు.

## నిరవధిక సమ్మెలోకి విఆర్ఏ లు

**తరిగొప్పుల జూలై 25 (ప్రజామంటలు):** విఆర్ఏ మండల అధ్యక్షుడు తాటి ఎల్లయ్య ఆద్వర్యంలో మండల కేంద్రంలోని తహసిల్దార్



కార్యాలయం ముందు విఆర్ఏ లు పూర్తిస్థాయి నిరవధిక సమ్మె లోకి వెళ్లారు. మండల అధ్యక్షుడు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి కేసిఆర్ గారు విఆర్ఏ లకు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచి మాకు తగిన న్యాయం చేయాలని లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏల ఉపాధ్యక్షుడు జంగ రవి, ప్రచార కార్యదర్శి అల్లిబిల్లి కనకయ్య కోశాధికారి గునిగంటి రాజ పోషయ్య, నందన బోయిన యాదయ్య, దిండిగాల వెంకటయ్య, గునిగంటి నరసింహులు, సానాది బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూ నుంచి డాక్టరేట్ అందుకున్న సంధ్యా ప్రియదర్శిని

**హన్మకొండ జులై 25 (ప్రజామంటలు):** కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగం పరిశోధకురాలు సంధ్యా ప్రియదర్శినికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. "ది స్టడీ ఆఫ్ ఫోక్ మెడిసినల్ క్లెయిమ్స్ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్ట్ అండ్ థైర్ వ్యాలిడేషన్" అనే అంశంపై ప్రో. రాగన్ ఆధ్వర్యంలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సంధ్యా ప్రియదర్శిని కి డాక్టరేట్ దక్కింది. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## దేశ తొలి గిరిజన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజయోత్సవ ర్యాలీ

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** బిజెపి గిరిజన మోర్చా ఆధ్వర్యంలో భారత రాష్ట్రపతిగాద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేసిన




సందర్భంగా సోమవారం నెహ్రూ పార్క్ నుండి బస్టాండ్ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో విద్యార్థి ఉద్యమ నేత డాక్టర్ ఆరుట్ల దశమంత రెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా. బి ఆర్. అంబేడ్కర్ కన్న కలలు 75 వసంతాల తర్వాత నెరవేరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉడుగుల రమేష్, విద్యాసాగర్ రెడ్డి, శివరాజ్ యాదవ్, దేవరాయి ఎల్లయ్య, సౌద రమేష్, మహంకాళి హరిచంద్ర గుప్తా, బేజాడి బీరప్ప, పెద్దోజు జగదీష్ శానబోయిన మైపాల్, ఆకుల క్రాంతి కుమార్, కోట వినోద్ కుమార్, సీతారాములు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెంబట్ల కోనాపూర్ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయ ఈవో గా నూతనంగా నియామకమైన అనూష జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను మరియు దుబ్బ రాజేశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. వెంట ఆలయ చైర్మన్ శంకరయ్య, ధర్మకర్తలు శేఖర్ గౌడ్, కవిత, జయశ్రీ, రాకేష్, నరేష్, నారాయణ, గోపాల్, ప్రథమ పూజారి కైలాసం, జూనియర్ అసిస్టెంట్ రవి తదితరులున్నారు.

## మన్నెగూడెం ను మండలంగా ప్రకటించాలి

**జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మన్నెగూడెంను మండల%శీ%గా ప్రకటించాలని కోరుతూ జగిత్యాల జిల్లా కలెక్టరేట్




ముందు గ్రామంలోని ఇంటికి ఒకరు చొప్పున ధర్నా నిర్వహించారు. గత 1984 నుండి మండలంగా ప్రకటిస్తామని చెప్పి మోసం చేశారని, తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రకటించిన దాంట్లో మన్నెగూడెం మండలం లేకపోవడంతో ఉద్రిక్తతకు లోనై గ్రామ ప్రజలు 15 రోజుల పాటు నిరసన తెలుపుతామని ప్రజా ప్రతినిధులు అందర రాజీనామా చేస్తామని మన్నెగూడెం మండలంగా ప్రకటించాలని లేదంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని తెలిపారు.

## మంకమ్మతోట లో ఇంటింటికి మొక్కల పంపిణీ

**కరీంనగర్ జూలై 25 (ప్రజామంటలు):** 8 వ విడుత హరితహారంలో



భాగంగా కరీంనగర్ పట్టణం 36 వ డివిజన్ మంకమ్మతోటలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్ యాదగిరి సివిల్ రావు, కమీషనర్ సేవా ఇస్లావత్. డివిజన్ లో ప్రతి ఇంటికి 6 మొక్కలు అందించి, నాటి వాటిని సంరక్షించాలని సూచించిన మేయర్ యాదగిరి సునిల్ రావు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి హరి శంకర్. కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, తోట రాములు.

## ఎస్.ఐ. కి భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఫోటో అందజేత

**నర్మెట్ట జూలై 25 (ప్రజామంటలు):** భారత రాష్ట్రపతి గా ప్రమాణ స్వీకారం చేసిన ద్రౌపది ముర్ముకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ....



నర్మెట్ట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ద్రౌపతి ముర్ము ఫోటోను ఎస్ఐ కి అందజేసిన ధరావత్ రాజు నాయక్ తో పాల్గొన్న బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మ్యాక అశోక్, బిజెపి ప్రధాన కార్యదర్శులు నాగభూషణం శర్మ, తోకల శేఖర్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి బైరగొని ఆంజనేయులు, బీజేవైఎం మండల అధ్యక్షులు పోలు రాజు, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు సాయినాథ్, బీజేవైఎం ఉపాధ్యక్షులు రాజబోయిన శ్రీనివాస్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రంజిత్, భూతూ అధ్యక్షులు అంజి, మధు తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొన్న జనగామ కవయిత్రులు కొట్టె శ్రీలత, బుదారపు లావణ్య

**జనగామ జూలై 25 (ప్రజామంటలు):** శ్రీశ్రీ కళావేదిక, బోయి భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో జనగామ కవయిత్రిలు కొట్టె శ్రీలత, బుదారపు లావణ్య పాల్గొని కవితగానం చేసి సోమవారంనాడు ఘనంగా సన్మానం పొందారు. ఈ సందర్భంగా 222 మంది కవయిత్రులు మహిళా సాధికారత పై సృజించిన కవితలు “ఆమె” సంకలనం ఆవిష్కరించారు. ఈ సంకలనంలో కొట్టె శ్రీలత రాసిన “ఆదిశక్తి “ శీర్షికతో అమ్మ ఇది పాడులోకమని చెప్తే నీ కడుపులోనే ఉండేదాన్ని కదమ్మా కవిత,బుదారపు లావణ్య “నిన్ను నువు రక్షించుకో” శీర్షికతో మధించిన మానవ మృగాలు అంటూ రాసిన ఇరువురి కవిత ఇందులో చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, శ్రీమతి బోయి హైమావతి బీమన్న, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి డాక్టర్ హరికృష్ణ చేతుల మీదుగా సన్మానం అందుకోవడం పట్ల జనగామ కవులు,కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.



## బిజెపి శ్రేణుల విజయోత్సవ ర్యాలీ

**కోరుట్ల టౌన్ 25 (ప్రజామంటలు):** భారత 15 వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం సందర్భంగా సోమవారం బిజెపి నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ చౌరస్తా నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కార్యాలయంలో రాష్ట్రపతి ముర్ము చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిరుమల్ల ధనుంజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబార్ ప్రభాకర్,జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదవేని మహేష్, పుదరి అరుణ, మహిపాల్ రెడ్డి, బిజేవైఎమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనికల నవీన్, జిల్లా కార్యదర్శి సాడిగే మహేష్, మెటపల్లి పట్టణ అధ్యక్షుడు ఆర్మూర్ రంజిత్, ఎస్సీమోర్చ అధ్యక్షుడు వెంకట స్వామి, కలాల సాయి చందు, పట్టణ మహిళ అధ్యక్షురాలు పద్మరాణి, పూదరి అరుణ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## హను ఈ సారైనా కొడతాడా?

అందాల రాక్షసి సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపుని సొంతం చేసుకున్నారు హను రాఘవపూడి. ఈ మూవీతో దర్శకుడిగా పరిచయమైన ఆయన తొలి చిత్రంతోనే మంచి గుర్తింపుని సొంతం చేసుకున్నారు. రానీ ఈ మూవీ ఆశించిన స్థాయిలో మాత్రం సక్సెస్ ని అందించలేకపోయింది. అనుకున్న కథని అనుకున్న వేలో ప్రజెంట్ చేయకపోవడం వల్లే సరైన ఫలితాన్ని అందించలేకపోయిందని ఇప్పటికి కామెంట్ లు వినిపిస్తుంటాయి. అయితే ఈ మూవీ తరువాత హను రాఘవపూడి చేసిన కృష్ణగాడి వీర ప్రేమగాధల లై చిత్రాలకు కూడా అదే ప్రధాన లోపంగా నిలిచింది. దీంతో ఈరెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద నిలబడలేకపోయాయి. ఇక వీటి తరువాత ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా హను రాఘవపూడి తెరకెక్కించిన మూవీపడి పడి లేచే మనసు. శర్వానంద్ సాయి పల్లవి జంటగా నటించారు. ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య విడుదలైంది. దీని కోసం నిర్మాత భారీగానే ఖర్చు చేశారు కూడా. నేపాల్ నేపథ్యంలో సాగే లవ్ స్టోరీగా ఈ మూవీని రూపొందించారు. మధ్యలో భూకంపం కథలని మలుపులు తిప్పడంతో కథలో వున్న ఫీల్ మొత్తం పోయింది. దీంతో నిర్మాతకు ఈ మూవీ భారీ నష్టాలని తెచ్చిపెట్టింది. కష్టాల్లోకి నెట్టేసింది. ఈ సినిమా రిలీజ్ కు ముందు ఇదొక ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్ అని దర్శకుడు చెప్పుకొచ్చాడు.కానీ ఫలితం మాత్రం ఇందుకు భిన్నంగా రావడం గమనార్హం. ఇదే దర్శకుడు తెరకెక్కించిన లేటెస్ట్ మూవీ సీతారామం,యుద్ధంతో రాసిన ప్రేమలేఖ అనేది ఉపశీర్షిక. స్వప్న సినిమా బ్యానర్ పై వైజయంత్రీ మూవీస్ సమర్పణలో భారీ చిత్రాల నిర్మాత సి. అశ్వనీదత్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఆగస్టు 5న భారీ స్థాయిలో తెలుగుతో పాటు తమిళ మలయాళ భాషల్లో విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సోమవారం ఈ మూవీ ట్రైలర్ ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు సినిమా గురించి వర్ణించిన తీరు నెట్టింట వైరల్ గా మారింది. బాగా వర్షం వచ్చినప్పుడు వేడి వేడి కాఫీ తాగిన ఫీలింగ్ ని కలిగిస్తుందని ఎండా కాలం చల్లని వాటర్ తాగినట్టుగా వుంటుంది.అందాల రాక్షసిని మించి వుంటుంది. ఈ మూవీ విషయంలో నేను చాలా కాన్ఫిడెంట్ గా వున్నాను. ఈ సినిమా చూస్తూ మిమ్మల్ని మీరు మర్చిపోతారు. సీతారామంతో కలిసిపోతారని రాసిస్తాను. థియేటర్లో సినిమా చూశాక సినిమా మీతో పాటు మీ వెంటే వచ్చేస్తుంది. మీతో పాటు పడుకుంటుంది.. మీతో పాటే పడుకుంటుంది...మీ పెద్ద వాళ్లు కొన్ని సినిమాల



గురించి మీతో చెప్పినట్టే మీరు ఏజ్ పడ్డాక మీ వాళ్లతో ఈ సినిమా గురించి చెబుతారు. ఇది నా గ్యారంటీ!. అంటూ చెప్పుకొచ్చారు.ఈ స్పీచ్ విన్న వాళ్లంతా చాలా అతిగా వుందని కామెంట్ లు చేస్తున్నారు. పడి పడి లేచే మనసు టైమ్ లో ఇదే స్థాయిలో చెప్పిన హను రాఘవపూడి బాక్సాఫీస్ వద్ద ఫెయిల్ అయ్యాడని ప్రస్తుతం సీతారామం విషయంలో అయినా గట్టిగా కొడతాడా? అని కామెంట్ లు చేస్తున్నారు. దర్శకుడి స్పీచ్ మాత్రం ఎక్కడో కొడుతోందని కాన్ఫిడెంట్ వుండొచ్చు కానీ మరీ ఓవర్ కాన్ఫిడెన్స్ కనిపిస్తోందని నెటిజన్ లు విమర్శలు గుప్పిస్తున్నారు.

## క్లాసిక్ లవ్ స్టోరీ సీతా రామం

### దుల్కర్ సల్మాన్!

స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ కథానాయకుడి గా వైజయంతీ మూవీస్ సమర్పణలో స్వప్న సినిమా పతాకంపై స్టార్ ప్రొడ్యూసర్ అశ్వినీదత్ నిర్మాణంలో హను రాఘవపూడి దర్శకత్వంలో ‘యుద్ధంతో రాసిన ప్రేమకథ’గా ప్రతిష్టాత్మకంగా రూపొందిన చిత్రం ‘సీతా రామం’. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన కీలక పాత్రలో కనిపిస్తున్నారు. బ్రిగేడియర్ విష్ణు శర్మ సుమంత్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రాండ్ గా జరిగిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో ‘సీతారామం’ థియేట్రికల్ ట్రైలర్ ని చిత్ర బృందం విడుదల చేసింది. ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో దుల్కర్, హను రాఘవపూడి, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన, సుమంత్, రమేష్ ప్రసాద్, నిర్మాత అశ్వినీదత్ పాల్గొన్నారు. థియేట్రికల్ ట్రైలర్ ‘సీతారామం’ ఎపిక్ లవ్ స్టోరీలోని కీలకమైన ఘట్టాలని ఆసక్తికరంగా ఆవిష్కరించింది.“ఇరవై ఏళ్ల క్రితం లెఫ్టినెంట్ రామ్ నాకొక బాధ్యత అప్పగించాడు. ఈ ఉత్తరం సీతామహాలక్ష్మికి నువ్వే చేర్చాలి’ అనే డైలాగ్ తో మొదలైన ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. రామ్ ఒక ఒక అనాథ. కాశ్మీర్ లో లెఫ్టినెంట్ గా భాద్యతలు నిర్వహిస్తుంటాడు. సీత అనే అమ్మాయి నుండి వచ్చిన ఉత్తరం రామ్ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. రామ్, సీతను కలుస్తాడు. వారి మధ్య ప్రేమ చిగురిస్తుంది. రామ్ కాశ్మీర్ లోని తన క్యాంపు కి తిరిగి వచ్చినప్పుడు సీతకు ఒక లేఖ రాస్తాడు. కానీ అది ఆమెకు చేరలేదు. 20 ఏళ్ల తర్వాత సీతకు ఆ లేఖ ఇచ్చే భాధ్యత రష్మిక మందన్న, తరుణ్ భాస్కర్ ల పై పడుతుంది. సీత అన్వేషణ లో విఫలమైన వారు.. రామ్ కోసం అన్వేషణ మొదలుపెడతారు. కానీ రామ్ ని పట్టుకోవడం సీతని అన్వేషించడం కంటే కష్టమౌతుంది. దీనికి కారణం రామ్ బాస్ బ్రిగేడియర్ విష్ణు శర్మ (సుమంత్). ట్రైలర్ లో ఆవిష్కరించిన ఈ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరీయాసిటీని పెంచాయి. 1965, 80 నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ ఆనాటి వాతావరణాన్ని ప్రతిబింబించేలా అద్భుతంగా సాగింది. అత్యున్నత నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేసిన ఈ చిత్రం చిరకాలం నిలిచిపోయే చిత్రంగా అవుతుంది అని ట్రైలర్ చూస్తేఅర్ధమౌతుంది. దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ తమ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు,. ఇందులో వారి కెమిస్ట్రీ మ్యాజికల్ గా వుంది. రష్మిక మందన్న హీరోయిక్ రోల్, సుమంత్ నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో కనిపించడం ఆసక్తికరంగా వుంది. అందమైన ప్రేమకథలు రూపొందించడంలో హను రాఘవపూడి మరోసారి తన ప్రత్యేకతని నిరూపించుకున్నారు. సీత, రామ్ ల ప్రేమకథని చాలా అందంగా, హృద్యంగా



చూపించారు. “నాలుగు మాటలు పోగేసి ఉత్తరం రాస్తే కాశ్మీర్ ని మంచుకొదిలేసి వస్తారా?“ అనే డైలాగ్ ఈ ప్రేమ కథ ఎంత అందంగా వుంటుందో చెప్పకనే చెప్పింది. పీఎస్ వినోద్ సినిమాటోగ్రఫీ విజువల్ వండర్ గా వుంది. ట్రైలర్ కి విశాల్ చంద్రశేఖర్ ఇచ్చిన రీ-రికార్డింగ్ గ్రాండ్ గా ఉంది. ఎమోషన్స్ ని అద్భుతంగా ఎలివేట్ చేసింది. రెండు విభిన్న కాలాల కథను సులభంగా అర్ధమయ్యే రీతిలో అందించడంలో మాస్టర్ ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు తన మార్క్ ని చూపించారు. వైజయంతీ మూవీస్ , స్వప్న సినిమా గ్రాండ్ ప్రొడక్షన్ డిజైన్ అత్యద్భుతంగావుంది. విజువల్స్ గొప్ప ఆర్టిస్ట్ చిత్రీకరించిన పెయింటింగ్స్ లా ఉన్నాయి. ఆగస్ట్ 5న సీతారామం తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. అందరూ రొమాంటిక్ హీరో అని పిలవడంతో విసుగొచ్చి ఇంక ప్రేమకథలు చేయకూడదని అనుకున్నాను. ఇలాంటి సమయంలో హనుగారు ఈ కథతో వచ్చారు. అద్భుతమైన ప్రేమ కథ. చిరకాలం గుర్తిండి పోయే ఎపిక్ సినిమా. ఇలాంటి కథని ఎట్టిపరిస్థితిలో వదులకూడదనిపించింది. చివరి ప్రేమకథగా సీతారామం లాంటి క్లాసిక్ ఎపిక్ లవ్ స్టోరీ చేయాలని నిర్ణయించుకున్నా. సీతారామం షూటింగ్ అద్భుతమైన అనుభవం. దేశంలోని అనేక ప్రదేశాలలో షూట్ చేశాం. అన్ని ప్రదేశాలు నేను ఎప్పుడూ చూడలేదు. కథని బలంగా నమ్మాము. అందరం వంద శాతం బెస్ట్ వర్క్ ఇచ్చాం. అశ్వినీదత్ గారి లాంటి సినిమా పై ప్యాషన్ వున్న నిర్మాతతో ఇప్పటివరకూ పని చేయలేదు. అన్ని అవసరాలని సమకూర్చారు. ఎంతో అప్యాయంగా భోజనం పెట్టెవారు. హను గారు సినిమా పై గ్రేట్ ప్యాసన్ వున్న రచయిత, దర్శకుడు. ఆయనకి సినిమా తప్పితే మరో ద్యాస లేదు. సీతగా మృణాల్ అద్భుతంగా చేసింది. రష్మిక పాత్ర కూడా అద్భుతంగా వుంటుంది. గ్రేట్ టీమ్ తో పనిచేశాననే ఆనందం వుంది. సినిమాలో అద్భుతమైన మ్యూజిక్ వుంది. సీతారామం లార్జర్ దెన్ లైఫ్ సినిమా. ఆగస్ట్ 5న అందరూ థియేటర్ లో చూసి ఎంజాయ్ చేయండి” అన్నారు.



భారత రాష్ట్రపతిగా ద్రౌపతి ముర్ము ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్న జగిత్యాల భారత్ సురక్ష సమితి నాయకులు..

## తెలంగాణ స్టేట్ స్పౌస్ ఫోరం టీచర్ల శాంతియుత ర్యాలీ

**హన్మకొండ జులై 25 (ప్రజామంటలు):** హన్మకొండలో తెలంగాణ స్టేట్ స్పౌస్ ఫోరం పేరిట భారీ సంఖ్యలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ర్యాలీ




నిర్వహించారు. నూతన జిల్లాల పేరిట 13 జిల్లాలకు ట్రాన్స్ ఫర్ చేసిన స్పౌస్ ఉపాధ్యాయులను ఒకే జిల్లాలో నియమించాలని పబ్లిక్ గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ట్రాన్స్ఫర్ల వల్ల కుటుంబాలు విడదీసి అన్యాయం చేశారని కలెక్టరు వినతిపత్రం ఇవ్వనున్నారు.



జనగామ పట్టణం మున్సిపల్ పరిధి లోని 3వ వార్డ్, బాలాజీనగర్ లో హరితహారంలో భాగంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేసిన కౌన్సిలర్ సుధా సుగుణాకర్ రాజు.



జనగామ జిల్లా రఘునాథ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లకు మంచి ప్రవర్తనతో ఉండాలని కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్.ఐ. వీరేందర్



శ్రీ ఉప్పలమ్మ సహిత ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆషాడమాసం చివరి ఆదివారం ఉప్పలమ్మ వారికి శాకంబరి నిర్వహించి 800 మందికి అన్నదానం. పాల్గొన్న దేవాలయ పూజారి వారణాసి పవన్ శర్మ, వార్డు కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, ఆరుట్ల శోభ అనంతరెడ్డి, మెతుకు రమాదేవి, చైతన్య లోకమంత రెడ్డి, మార్గం రవి, కూరగాయల లింగయ్య, ఓరుగంటి ఆంజనేయులు, పల్లవి, సోమిరెడ్డి, బుచ్చిరెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్, సురేష్ రెడ్డి, వీరారెడ్డి, కలకుంట్ల శ్రీనివాస్, ఎర్రం ప్రసాద్, దాస నరసయ్య, మంజు సత్తు.

## యువకుడికి ఆర్థిక సాయం అందజేత

**గొల్లపల్లి జులై 25 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం లోని శ్రీరాములపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పొడేటి మహేష్ అనే యువకుడు ఇటీవల ఓ దాడిలో తీవ్రంగా గాయపడిన జై భీమ్ అభ్యుదయ సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో 30 వేల రూపాయల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా జై భీమ్ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో తమ వంతుగా ఆర్థిక సాయం అందజేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేద యువకుడికి అండగా నిలిచిన సంఘానికి పలువు అభినందించారు తమ బిడ్డకు అండగా నిలిచిన సంఘా సభ్యులకు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రాజేష్, శంకర్, సాగర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com